## విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రచురితమవుతున్న ప్రముఖ తెలుగు దినపత్రిక విజయకెరటంకు విలేకరులు కావలెను.హైద్రాబాద్, యాదాద్రి భువనగిరి, వరంగల్, సూర్యాపేట, ఖమ్మం, మేడ్చల్ తో పాటు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, మండలాలు, గ్రామాల నుండి చురుకైన, వార్తలపై ఆసక్తి గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి.జర్నలిజం పై ఆసక్తి ఉన్న కొత్త వారికి కూడా అవకాశం కలదు.

ఆసక్తి కలవారు. ఈ క్రింది నెంబర్‌కు సంప్రదించగలరు...

CELL: 9908408528



# విజయ కెరటం

VIJAYA KERATAM
TELUGU DAILY
VOLUME: 18 ISSUE: 151
తెలుగు దినపత్రిక



## లంచగొండుల వివరాలు ఎసిబికి తెలపండి

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు, లంచగొండితనానికి పాల్పడుతున్నట్లు ఎలాంటి సమాచారమున్నా అవినీతి నిరోధక శాఖకు తెలయజేయ వలసిందిగా ఎసిబి డైరెక్టర్ జనరల్ ప్రజలను కోరారు. సమాచారం అందించిన వారుపేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఒక ప్రకటనలో తెలిపారు.

వివరాలకు:

డైరెక్టర్ జనరల్, అవినీతి నిరోధక శాఖ,
మొజంజాహి మార్కెట్ రోడ్, హైద్రాబాద్ -500 001
ఫోన్: (040) 2475132, 247456,24745626



నల్లగొండ | సంపుటి:18 | సంచిక: 179 | ఎడిటర్: యం.డి. మక్సూద్ అహ్మద్ | 02-08-2026 ఆదివారము | పేజీలు :4 | వెల :1/-


## గోదావరి పరివాహక ప్రాంత ప్రజలకు శాశ్వత రక్షణ



ములుగు, : ములుగు జిల్లాలో గోదావరి పరివాహక ప్రాంత ప్రజలకు శాశ్వత రక్షణ కల్పిస్తున్నామని, వరదలపై జిల్లా యంత్రాంగం నిరంతరం అప్రమత్తతో ముందస్తు చర్యలతో నష్టాలను నివారణ చేయడం జరిగిందని, లోతట్టు ప్రాంత ప్రజలకు పునరావాసం, ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. శనివారం జిల్లాలోని గోదావరి నది పరివాహక ప్రాంతాన్ని సందర్శించి, గోదావరి వరద ప్రవాహాన్ని మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పిఓ లెనిన్ వత్సల్ టోప్పో లతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గత రెండు రోజులుగా తెలంగాణతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నది ఉప్పొంగుతున్న సందర్భంగా జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా పనిచేస్తోందని తెలిపారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఐటిడిఏ పిఓ, సాగునీటి శాఖ అధికారులు, ఇతర శాఖల అధికారుల తో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామన్నారు. గత రెండేళ్లుగా ములుగు జిల్లాలో ప్రత్యేక వరద నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసి, వాగులు, గోదావరి పరివాహక ప్రాంతాలు, ముంపు గ్రామాల్లో ప్రత్యేక అధికారులను నియమించి పరిస్థితిని నిరంతరం పరిశీలిస్తున్నామని వివరించారు. గోదావరి మూడో ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరుకున్నప్పటికీ ముందస్తు చర్యల కారణంగా ఎలాంటి నష్టం జరగలేదన్నారు. రెండు నెలల క్రితమే గోదావరి పరివాహక ప్రాంతాల్లో జిల్లా ఉన్నత అధికారులతో, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పర్యటించి అవసరమైన జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. గతంలో రామన్నగూడెంలోకి వరద నీరు చేరేదని, ఈసారి ముందస్తు చర్యలతో ఆ ప్రమాదాన్ని నివారించగలిగామని పేర్కొన్నారు. రామన్నగూడెం, మంగపేట ప్రాంతాల్లో కరకట్ట నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, సుమారు 800 మీటర్ల మేర పనులు పూర్తయ్యాయని తెలిపారు. ప్రజలు వరదలు, వాగులు ఉప్పొంగిన సమయంలో వాటిని దాటే ప్రయత్నం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. వర్షాల సమయంలో అడవుల్లోకి పశువులను మేపేందుకు వెళ్లడం, చేపల వేటకు వెళ్లడం ప్రమాదకరమని హెచ్చరించారు. 2022, 2023 సంవత్సరాల్లో గోదావరి, జంపన్నవాగు వరదల వల్ల ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మిగిలిన కరకట్ట పనులను కూడా పూర్తి చేసి గోదావరి పరివాహక ప్రాంత ప్రజలకు శాశ్వత రక్షణ కల్పిస్తామని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న పేద కుటుంబాలను గుర్తించి రెండో విడతలో పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇండ్ల ను మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏటూరు నాగారం ఏ ఎస్ పి మనన్ భట్, గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి,ఆర్డీవో కృష్ణవేణి, తహసిల్దార్, ఎం పి డి ఓ, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నల్లగొండ మండలంలోని గ్రామాల అభివృద్ధి లక్ష్యం



నల్లగొండ:గ్రామాల అభివృద్ధికి గ్రామస్తులందరూ కలిసికట్టుగా ఉండాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆయన నల్గొండ జిల్లా, నల్గొండ, తిప్పర్తి మండలాలలో వివిధ గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు.ముందుగా నల్గొండ మండలం, చిన్న సూరారం గ్రామ హమ్లెట్ గ్రామమైన పావురాల గూడెంలో కోటి 35 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన పిడబ్ల్యుడి రోడ్డును మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చిన్న సూరారం గ్రామ సర్పంచ్ నారాగోని రేణుక భద్రయ్య మరియు పొగాకుల సతీష్ ఉప సర్పంచ్ కర్ర నరేందర్ వార్డ్ నెంబర్ బొప్పని రేణుక వార్డ్ నెంబర్ కర్ర రూప వార్డ్ నెంబర్ మాజీ సర్పంచ్ సంకు ధనలక్ష్మి బాలరాజు మార్త రాంబాబు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మార్క్ కొండయ్య కట్ట లక్ష్మణ్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు చిన్న సూరారం, పెద్ద సూరారం, చందనపల్లి గ్రామాలలో ఏర్పాటుచేసిన సమావేశాలలో గ్రామస్తులతో మాట్లాడారు. మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు ఆర్థికంగా వారి కాళ్లపై వారు నిలబడి సాధికారత సాధించేలా ప్రభుత్వం తరఫున మహిళా సంఘాలతో రైస్ మిల్లులు ,గోదాములు,ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామని, మహిళలు చిన్నచిన్న వ్యాపారాలతో పాటు, రైస్ మిల్లులు నిర్వహించాలని కోరారు. ఆగస్టు 15 న చిన్న సూరారం గ్రామ మహిళా సంఘాలకు 3 కోట్ల రూపాయలు, పెద్ద సూరారం గ్రామ సంఘాలకు రెండున్నర కోట్లు, చందనపల్లి గ్రామ మహిళా సంఘాలకు కోటి 50 లక్షల రూపాయల రుణాల చెక్కులను అందించనున్నట్లు మంత్రి వెల్లడించారు. చిన్న సూరారం, పెద్ద సూరారం గ్రామాల మధ్య వేర్ హౌసింగ్ గోదాం లేదా రైస్ మిల్ ఏర్పాటు చేసేందుకు 5 నుండి 10 ఎకరాల స్థలాన్ని చూడాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పావురాల గూడెంలో చౌకధర దుకాణాన్ని మంజూరు చేయడమే కాకుండా, వెంటనే డీలర్ ను నియమించాలని ఆదేశించారు. ఆయా గ్రామాలలో నిర్మాణంలో ఉన్న గ్రామ సంఘాల భవనాలను నిర్మాణాన్ని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మహిళా సంఘాలకు గరిష్టంగా బ్యాంకు లింకేజీ రుణాలు ఇవ్వాలని డి ఆర్ డి ఓ ను ఆదేశించారు.మహిళలు తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించాలని కోరారు. మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని తద్వారా కుటుంబాల అభివృద్ధి చెందుతాయన్నారు. నల్గొండ, కనగల్, తిప్పర్తి మండలాలలో మహిళా సంఘాల చేత రైస్ మిల్లులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు.రాష్ట్ర ప్రభుత్వం గుడిసెల్లో ఎవరు ఉండరాదన్న ఉద్దేశంతో ప్రతి ఒక్కరికి 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నదని, మొదటి విడత రాష్ట్రవ్యాప్తంగా ఇండ్లు ఇవ్వడం జరిగిందని,రెండవ విడత గుడిసెలలో నివసించేవారికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్లాట్లు ఉన్న వారికి కూడా ఇండ్లు నిర్మించి ఇస్తామని చెప్పారు. అందరికీ రేషన్ కార్డులతో పాటు, సన్న బియ్యం ఇస్తున్నామని,రాష్ట్ర వ్యాప్తంగా మూడు కోట్ల 25 లక్షల మందికి సన్న బియ్యం ఇస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో 20000 కోట్ల రూపాయలతో ఆర్ అండ్ బి రహదారులు నిర్మిస్తున్నామన్నారు. ఇకపై తాను గ్రామాలలో నిరంతరం పర్యటిస్తానని, వారానికి ఒకరోజు గ్రామాలు తిరుగుతానని, ఆదివారం నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో పర్యటిస్తానని, అభివృద్ధి కార్యక్రమాలకు ఎలాంటి నిధుల కొరత లేదని చెప్పారు.చందనపల్లి గ్రామ డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, గ్రామ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డ్ లో చెత్తను ఖాళీ చేయిస్తున్నామని, ప్రజలు లేని చోట డంపింగ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఇదివరకే జిల్లా కలెక్టర్ ను ఆదేశించినట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో ఒక సబ్ స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని ,70% గ్రామాలలో సబ్‌స్టేషన్లు ఉన్నాయని మంత్రి తెలిపారు. అలాగే గ్రామంలోని పాఠశాలలో కంప్యూటర్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు .జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ ఈ మోహన్, పంచాయతి రాజ్ ఈ ఈ గిరిధర్, ఆర్ అండ్ బి ఈ ఈ శ్రీధర్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, తహసిల్దార్ ఎంపీడీవో అధికారులు,ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు మంత్రి వెంట ఉన్నారు.

## తైమూర్-లెస్టే రాయబారితో మంత్రి అజారుద్దీన్ భేటీ




హైద్రాబాద్: రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, ప్రభుత్వ రంగ సంస్థల శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ తైమూర్-లెస్టే ప్రజాస్వామ్య గణరాజ్య రాయబారి కార్లిటో నునెస్, తొలి కార్యదర్శి ఆరెలియో బారోస్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో హైదరాబాద్ చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ మనవడు నవాబ్ మీర్ నజఫ్ అలీ ఖాన్ కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా భారత్--తైమూర్-లెస్టే ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం, వివిధ రంగాల్లో పరస్పర సహకారం, ప్రజల మధ్య సంబంధాల విస్తరణ, ఉమ్మడి ప్రయోజనాల అంశాలపై విస్తృతంగా చర్చించారు.భారత్--తైమూర్-లెస్టే మధ్య పెరుగుతున్న దౌత్య సంబంధాలను మంత్రి అజారుద్దీన్ స్వాగతిస్తూ, ఇలాంటి సమావేశాలు ఇరు దేశాల మధ్య స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.సమావేశం సత్సంబంధాలు, పరస్పర సహకారం, ఉభయ దేశాలకు ప్రయోజనకరమైన భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలనే ఉమ్మడి సంకల్పంతో ముగిసింది.

## కంపెనీ సెక్రటరీస్ సదస్సుకు శ్రీధర్ బాబు శ్రీకారం




హైద్రాబాద్: హైదరాబాద్‌లోని కొండాపూర్ తెలంగాణ కాంట్రాక్టర్స్ కల్చరల్ క్లబ్‌లో ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 50వ దక్షిణ భారత ప్రాంతీయ కంపెనీ సెక్రటరీస్ సదస్సు--2026ను రాష్ట్ర సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు ప్రారంభించారు.ఈ సందర్భంగా దక్షిణ భారత రాష్ట్రాల నుంచి హాజరైన 700 మందికి పైగా కంపెనీ సెక్రటరీస్‌ను ఉద్దేశించి మంత్రి మాట్లాడారు. కార్పొరేట్ పాలనను బలోపేతం చేయడంలో, పారదర్శకతను పెంపొందించడంలో, నియంత్రణ నిబంధనల అమలును నిర్ధారించడంలో, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచడంలో కంపెనీ సెక్రటరీస్ కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన ప్రశంసించారు.తెలంగాణ ప్రభుత్వం పారదర్శకత, జవాబుదారీతనం, పెట్టుబడిదారులకు అనుకూలమైన వ్యాపార వాతావరణాన్ని నిర్మించేందుకు కట్టుబడి ఉందని, తద్వారా స్థిరమైన ఆర్థికాభివృద్ధికి ఊతమివ్వడంతో పాటు మరిన్ని పెట్టుబడులను రాష్ట్రానికి ఆకర్షించే దిశగా కృషి చేస్తోందని మంత్రి తెలిపారు.సదస్సులో పాల్గొన్న ప్రతినిధులందరికీ మంత్రి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ సమావేశం విజయవంతంగా, విజ్ఞానవంతంగా, ఫలవంతంగా సాగాలని ఆకాంక్షించారు.

## కానిస్టేబుల్, ఎస్సై అభ్యర్థులకు బిగ్ అలర్ట్




హైద్రాబాద్: రాష్ట్రంలో పోలీస్ రిక్రూట్ మెంట్ ఆన్ లైన్ దరఖాస్తుల స్వీకరణ తేదీలను తెలంగాణ పోలీస్ నియామక మండలి ప్రకటించింది. ఆగస్టు 19వ తేదీ ఉదయం 8 గంటల నుంచి దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని తెలిపింది. సెప్టెంబర్ 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది. దరఖాస్తులను అధికారిక వెబ్ సైట్ ద్వారా మాత్రమే స్వీకరిస్తున్నట్లు వెల్లడించింది. ఎస్సై పోస్టులకు రూ. 750 (ఎస్సీ/ ఎస్టీ), రూ. 1,500 ఇతరులకు ఫీజు ఉంటుందని తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు పేర్కొంది. 7,437 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ : తెలంగాణ రాష్ట్రంలో 7,437 కొలువుల భర్తీకి టీఎస్ ఎల్ పీఆర్ బీ నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. పోలీస్, ఫైర్, జైళ్లు, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) శాఖలకు సంబంధించి వేర్వేరుగా 4 నోటీఫికేషన్లు వెలువరించింది. వీటిలో సబ్ ఇన్ స్పెక్టర్ , ఏఎస్సై, కానిస్టేబుల్ పోస్టులు మొత్తంగా 7 వేలకు పైగా పోలీసు కొలువులు ఉన్నాయి. అప్లికేషన్ ప్రొఫార్మాను అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరచనున్నట్లు పోలీస్ ఉద్యోగాల నియామక మండలి ఛైర్మన్ శ్రీనివాస రావు ఇటీవలే వెల్లడించారు. అభ్యర్థులు పీఎంటీ, పీఈటీ ప్రమాణాలు సరిగా ఉన్నట్లు నిర్ధారించుకున్న తర్వాతే పరీక్షలకు హాజరు కావాలని ఆయన సూచించారు.

## విద్యుదాఘాతంతో మహిళా రైతు మృతి

కారేపల్లి, : విద్యుదాఘాతంతో మహిళా రైతు మృతి చెందిన సంఘటన ఖమ్మం జిల్లా కారేపల్లి మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన వడ్డే ఉమా(45) తన భర్త రమేష్ తో కలిసి గ్రామ సమీపంలోని వ్యవసాయ భూమిలో పనులు చేసేందుకు వెళ్లింది. మధ్యాహ్న సమయంలో భర్త భోజనానికి ఇంటికి వెళ్లాడు. అక్కడే ఉన్న ఉమా వ్యవసాయ బావి వద్దకు వెళ్లగా విద్యుత్ మోటార్ వైరు తగిలిందిది. ఈ ప్రమాదంలో కరెంట్ షాక్ కు గురైన ఉమా బావిలో పడింది. భోజనానికి ఇంటికి వెళ్లి తిరిగి వచ్చిన రమేష్ కు తన భార్య ఉమ ఎంతసేపటికి కనిపించలేదు. దీంతో బావిలో చూడగా మృతి చెంది నీళ్లలో తేలాడుతూ కనిపించింది. స్థానికులు, బంధువుల సహాయంతో మృతదేహాన్ని బావిలో నుండి వెలికి తీశారు. ఉమాకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన మహిళ రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

## పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తాం..



వెల్గటూర్, : రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను దశలవారీగా పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం స్తంభంపల్లి చెరువును పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు.ధర్మపురి నియోజకవర్గం గోదావరి ఒడ్డున ఉన్నప్పటికీ గత ప్రభుత్వ హయాంలో రైతులకు అవసరమైన సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని మంత్రి విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా రైతులకు ఉపయోగపడే ప్రాజెక్టులను పూర్తి చేయడంలో విఫలమయ్యారని అన్నారు. రోళ్ళవాగు ప్రాజెక్టు అంచనాలను పెంచి అసంపూర్తిగా వదిలేశారని, అక్కపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు కాగితాలకే పరిమితమయ్యాయని పేర్కొన్నారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పూర్తి లక్ష్యంగా చర్యలు చేపట్టామని మంత్రి తెలిపారు. రోళ్ళవాగు ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేస్తున్నామని, అక్కపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పూర్తి చేసి 2027 జనవరిలో నీటి ఎత్తిపోతలు ప్రారంభిస్తామని వెల్లడించారు.స్తంభంపల్లి లిఫ్ట్ పనులు పూర్తి చేయడంతో పాటు స్తంభంపల్లి చెరువు మత్తడి, తూముల మరమ్మతులకు రూ.5 లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. అలాగే గొల్లపల్లి మండలంలోని యశ్వంతరావుపేట చెరువు పూడికతీత పనులను పూర్తి చేస్తామని తెలిపారు.మేడారం రిజర్వాయర్ నుంచి ముంజంపల్లి, మారేడుపల్లి గ్రామాలకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, బొమ్మరెడ్డిపల్లి--కొత్తపల్లి వరకు కాల్వ పనులను పూర్తి చేస్తామని మంత్రి చెప్పారు. నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు.

## శ్రీరామసాగర్ ప్రాజెక్టును పరిశీలించిన మంత్రులు



హైదరాబాద్: నిజామాబాద్ జిల్లాలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ,గడ్డం వివేక్ వెంకటస్వామి శనివారం పర్యటించారు. శ్రీరామసాగర్ ప్రాజెక్టును మంత్రుల బృందం పరిశీలించింది. ప్రాజెక్టులోకి ప్రవాహం వివరాలను మంత్రులు అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ... గోదావరిపై ఉన్న ప్రాజెక్టుల పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. ఎస్ఆర్ఎస్ పీ ప్రాజెక్టు పూడికతీతపై కార్యాచరణ చేస్తున్నామన్నారు. రెండు రోజుల్లో నీటి విడుదలపై స్పష్టమైన ప్రకటన చేస్తామని వివరించారు. మేడిగడ్డ, సుందిళ్ల నింపట్లేదని బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేసిందని ఉత్తమ్ ఆరోపించారు. మూడు బ్యారేజీల పునరుద్ధరణకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. 60 ఏళ్లయినా కాంగ్రెస్ నిర్మించిన డ్యాములు చెక్కు చెదరలేదని చెప్పారు. బీఆర్ఎస్ కట్టిన మూడు ప్రాజెక్టులు మూడేళ్లకే కూలిపోయాయని మంత్రి ఉత్తమ్ ఎద్దేవా చేశారు.

## చందానగర్‌లో బాలాజీ జ్యువెలరీలో భారీ చోరీ..



హైద్రాబాద్: చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలాజీ జ్యువెలరీ షాప్‌లో శుక్రవారం అర్ధరాత్రి భారీ దొంగతనం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చందానగర్ బజాజ్ ఎలక్ట్రానిక్స్ పక్కనే ఉన్న బాలాజీ జ్యూవెలరీ షాప్ వెనుక భాగంలోని ఎగ్జాస్ట్ ఫ్యాన్‌ను తొలగించి గోడకు రంధ్రం చేసి లోపలికి ప్రవేశించిన దుండగులు, వెనుక గది నుంచి ముందు గదికి మధ్య ఉన్న తలుపుకు కూడా రంధ్రం చేసి షాప్‌లోని బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు.ప్రాథమిక అంచనా ప్రకారం సుమారు 7 తులాల బంగారం, 4 కిలోల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న వెంటనే డీసీపీ చింతమనేని శ్రీనివాస్, ఏసీపీ సీహెచ్. వై. శ్రీనివాస్ కుమార్, సీసీఎస్, ఎస్‌వోటీ, చందానగర్ పోలీసు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.ఘటన స్థలంలో క్లూస్ టీమ్, ఫోరెన్సిక్ నిపుణులు ఆధారాలు సేకరిస్తున్నారు. సీసీటీవీ ఫుటేజీతోపాటు సాంకేతిక ఆధారాలను పరిశీలిస్తూ అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నిందితులను త్వరితగతిన గుర్తించి అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపినట్లు పోలీసులు తెలిపారు.

## ఏదేమైనప్పటికీ భారతదేశ భవిష్యత్తుకు యువతరం పాత్ర అత్యంత కీలకమైనది...

దేశంలో వివిధ వైద్య కళాశాలలో వైద్య కోర్సులో ప్రవేశం కోసం నిర్వహించే అర్హత పరీక్షలో జరిగిన ప్రశ్నాపత్రం పరీక్ష కంటే ముందుగానే బయటికి రావడం గత కొంతకాలం నుండి పెద్ద దుమారాన్నే రేపింది. ఈ క్రమంలో అభ్యర్థుల నుండి మొదలైన నిరసనలు క్రమ క్రమంగా అధికమై దేశంలో యువతరం వరకు వ్యాప్తి చెంది పరీక్ష లీక్ తీరుపై వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనలు వ్యక్తం కావడం ప్రభుత్వాన్నీ ఆలోచనలో పడవేయడం, యువత చేసిన నిరసనలో భాగంగా ఆ శాఖను నిర్వహి స్తున్న కేంద్ర మంత్రితప్పని పరిస్థితుల్లో యువత కోరుకున్న విధంగానే రాజీనామా చేయవలసిన పరిస్థితి రావడం ఇదంతా ఒక ఎత్తు అయితే, యువత జరిపి నిరసనతో ప్రభుత్వమే దిగి రావడం యువత అనుకుంటే సాధించ లేనిది ఏమీ లేదనే ఇలాంటి విషయం ఎల్లప్పుడు ప్రతి ఒక్కరు గుర్తించుకొనే విధంగా మిగిలిపోవడంతో ఇకపై అవినీతికి అక్రమాలకు పాల్పడుతున్న వారి తీరు మారా ల్సిన అవసరం ఉంటుంది. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజలచేత ఎన్నుకోబడిన నాయకులు కూడా యువతను దృష్టిలో పెట్టు కొని జాగ్రత్తగా ఆలోచించి నిర్ణయాలు చేయాల్సిన అవసరం ఉంటుందని పలువురు భిన్నాభి పాయాలు వ్యక్తం చేస్తుండ డం విశేషం.పరీక్ష విధానంలో కూడా పారదర్శకత కలిగిన విధానంతో సరికొత్త సంస్కరణలు రావాల్సిన అవసరం ఉంది. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ సందర్భంగా నెలకొన్న పరి స్థితులను గమనిస్తే భారతదేశంలో నవతరం నిరంతరం దేశ పరిణామాలపై స్పందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు గోచ రిస్తుంది. ప్రధానంగా ప్రభుత్వాలు విధానపరమైన కఠిన మైన చర్యలు తీసుకోకపోవడం, జాగ్రత్తలు పాటించకపోవ డం వలన అవినీతి అక్రమాలు లాంటి సంఘటనలు తర చుగా జరుగుతున్నాయనే విషయాలు ఎంతో కాలం నుండి చదువుకున్న యువతలో ఎంతో కొంత అశాంతికి అలజడికి కారణం అవుతున్నాయి. ఈ అంశంపై ప్రస్తుతం దేశవ్యా ప్తంగా నిరుద్యోగ యువత పార్టీలకతీతంగా తొలిసారిగా బయటికి వచ్చి నీట్ ప్రవేశ ప్రశ్నాపత్రం లీక్ బాధ్యులైన వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని అంతేకాకుండా దేశంలో ఎలాంటి అవినీతి అక్రమాలు జరిగినా మొదట ప్రజలు ఎన్నుకొన్న ప్రభుత్వంలోని సంబంధిత శాఖ మం త్రులు బాధ్యత వహించాలని డిమాండ్ చేసింది. అయితే ప్రస్తుతం ఆధునిక సాంకేతిక యుగంలో దేశంలోని యువత మధ్య కమ్యూనికేషన్ వ్యవస్థ సందేశాల పురోగతి అతివేగం గా జరగడంతో చాలామంది తొలిసారిగా యువతను మేల్కొ లిపే విధంగా గ్రూపులను రూపొందించుకుని సమస్యలపై స్పందించేందుకు నిర్భయంగా యువతరం నేడు ప్రభుత్వాల ను నేదుగా ప్రశ్నిస్తున్నది అంటే ప్రభుత్వాలు ఎంతో కొంత యువతరం ఆలోచనలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టవలసిన ఆవ శ్యకత ఉంది. ఈ విధంగా దేశంలోని యువతరానికి జరు. గుతున్న నష్టాన్ని ప్రశ్నించడానికి మాత్రమే కాకుండా ఎన్ను కున్న ప్రభుత్వాల అజెండా అమలు విధానాల పైన కూడా రాబోవు కాలంలో యువత ప్రశ్నించేందుకు వెనుకాడదేమో.ఏ విషయంలోనైనా సమాజానికి భంగం వాటిల్లే క్రమంలో అందుకు సంబంధించిన వారు ఎవరైనా జవాబుదారీతనం గాఉండాల్సి వస్తుంది అనేచర్చ జరుగుతుంది. నేటి యువత రేపటి భారత దేశ భవిష్యత్తుకు పునాదులు అలాంటి యువ త భారతదేశ సమైక్యతను దేశభక్తి సమగ్రతతోపాటుజాతీయ వాదాన్ని బలంగా వినిపిస్తున్నారు. అలాంటి యువతరం భారతదేశం ఉ న్నతికి భద్రతకు వెన్నంటి ఉంటారు అనేది అక్షరసత్యం. అందుకు ప్రభుత్వాలు కూడా దేశ భవిష్యత్తు లో కీలకంగా మారనున్న యువత సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కాలయాపన చేయకూడదనే విషయంపై అన్ని రాజకీయ పార్టీల్లో చర్చ జరగాల్సిన అవసరం ఉంది. విద్యావంతులు చదువుకున్న వారు భారత దేశంలో ఎక్కువ అవుతున్నారు. దేశంలో ఎలాంటి అంశాల్లోనైనా లోపాలు కనపడితే ప్రశ్నించేందుకు నేటితరం యువత సిద్ధంగా ఉం టుందని, లోపాలను సవరించే వరకు జవాబుదారీతనం వచ్చేంతవరకు నిరసన వ్యక్తం అవుతుందని, తలచుకుంటే సాధించేందుకు యువతరానికి ఏది అడ్డు లేదని చెప్పే రీతిలో యువతరం దేశవ్యాప్తంగా చేసిన శాంతియుత నిరసన విధానాలు చెప్పకనే చెప్తున్నాయి. నేటితరం యువ తరం ప్రశ్నించే విషయాలను నిజానిజాలను విశ్లేషించుకో వాలి, నిర్ధారణ చేసుకోవాలి, సరైన విధానం ఉంటే దాన్ని తప్పనిసరిగా అమలు చేసే విధంగా సమస్య కఠినతరం కాకుండా యువతరాన్ని కూడా కలుపుకుపోతూ వారి అభి ప్రాయాన్ని కూడా స్వాగతించాల్సిన అవసరం కొన్ని సంద ర్భాల్లో ప్రభుత్వాలకు ఉండాల్సిందేమో.ఈ క్రమంలో దేశ పరిస్థితుల విషయాలపై యువత మేల్కొని అప్రమత్తంగా ఉంటుందని పాలకులు అందించే విధానాలను నిరంతరం గమనిస్తూ సమాధానం కొరకు నిరంతరం ప్రశ్నిస్తామంటూ ముందుకు వస్తున్న యువతరానికి పాతతరం అనుభవాల సారం కూడా భవిష్యత్ భారత దేశ యువతకు దిశా నిర్దేశం అధిక్యత మార్గదర్శకం అవుతాయని భావించే వారు లేకపో లేదు. యువత ఐక్యత రాగానికి సంబంధించి ప్రభుత్వ ప్రజాపాలనలో ఎటువంటి లోపాలు జరిగినా సంబంధిత పరిపాలనా ప్రతినిధులు బాధ్యత వహించవలసి ఉంటుం దనే సందేశం దేశవ్యాప్తంగా వ్యాప్తి చెందింది. దేశ సమగ్ర తకు దేశ భద్రతకు ఎటువంటి విఘాతం కలగకుండా యువత మంచి ఆలోచన విధానాలు న్యాయం సమ్మతమైనవి అయితే పార్టీలకు రాజకీయాలకతీతంగా యువత ప్రశ్నిస్తే దానికి తప్పనిసరిగా జవాబుఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వా లకు ఉంటుందేమో. రాబోవు కాలంలో ఎలాంటి ప్రభుత్వా లు వచ్చినా యువతకు నష్టం చేసే ప్రతి అంశాన్ని జాగ్రత్త తో ఆచితూచి ఆలోచించి ముందుగానే సరిదిద్దుకునే ప్రయ త్నం చేస్తారేమో. ఏదేమైనప్పటికీ భారతదేశ భవిష్యత్తుకు యువతరం పాత్ర అత్యంత కీలకమైనది. ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత పార దర్శకమైన పాలన విధానాలు అనుసరించడమే కాకుండా ప్రతి అంశంలో జవాబుదారీతనాన్ని ప్రదర్శించడంతో పాటు అడపాదడపా తలెత్తుతున్న సమస్యలపై యువత చేస్తున్న నిరసనలపై స్పందించి ఆచితూచి సమయానుకూలంగాసరైన సమయంలో వివరణ ఇచ్చేందుకు తరచూ ప్రయత్నించి సఫ లం కావడం ఒక ఎత్తు. దేశభక్తి భారతదేశ జాతీయ సమైక్య త సమగ్రతకు భంగం కలగకుండా వ్యవహరిస్తున్న తీరు మరొక ఎత్తుకావడం దేశ భవిష్యత్తుకు శుభపరిణామమే.

## పరిణామాలను నిశితంగా గమనిస్తున్నాం: విదేశాంగ శాఖ



న్యూఢిల్లీ: రష్యా నుంచి చమురు, గ్యాస్‌ను కొనుగోలు చేస్తున్న దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారాన్ని అమెరికా ప్రభుత్వానికి కల్పించే బిల్లును భారత్ నిశితంగా గమనిస్తోందని విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) స్పష్టం చేసింది. అమెరికా సెనేట్‌లో ఈ బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో, భారత్ తన జాతీయ ప్రయోజనాలు, ఇంధన భద్రతకు ప్రాధాన్యం ఇస్తూనే పరిస్థితిని దగ్గరగా పరిశీలిస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందించారు. అమెరికాలో జరుగుతున్న శాసన ప్రక్రియను భారత్ నిరంతరం గమనిస్తోందని, ఈ అంశంపై సంబంధిత అమెరికా అధికారులతో వివిధ స్థాయిల్లో చర్చలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. భారత్ ఇంధన విధానం పూర్తిగా జాతీయ ప్రయోజనాల ఆధారంగానే కొనసాగుతుందని రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. దేశంలోని 140 కోట్ల మంది ప్రజల ఇంధన అవసరాలను తీర్చడం ప్రభుత్వానికి అత్యంత కీలక బాధ్యత అని చెప్పారు. అందుకే ఒకే దేశంపై ఆధారపడకుండా వివిధ వనరుల నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేసే విధానాన్ని భారత్ అనుసరిస్తోందన్నారు. ఇటీవల అమెరికా సెనేట్ 'రష్యా, ఇరాన్‌పై ఆంక్షల చట్టం-2026'కు భారీ మెజారిటీతో ఆమోదం తెలిపింది. 86 మంది సభ్యులు అనుకూలంగా, 12 మంది వ్యతిరేకంగా ఓటు వేయడంతో బిల్లు సెనేట్ ఆమోదం పొందింది. ఇప్పుడు అది ప్రతినిధుల సభ పరిశీలనకు వెళ్లనుంది. అక్కడ కూడా ఆమోదం పొంది, అధ్యక్షుడి సంతకం లభిస్తే చట్టంగా అమల్లోకి వస్తుంది. ఈ చట్టం అమల్లోకి వస్తే, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు రష్యాపై మరింత కఠినమైన ఆర్థిక ఆంక్షలు విధించే అధికారం లభిస్తుంది. రష్యాతో వ్యాపార సంబంధాలు కొనసాగిస్తున్న దేశాలు, సంస్థలపైనా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఈ ప్రతిపాదిత చట్టంలోని కీలక నిబంధనల ప్రకారం, రష్యా నుంచి గణనీయమైన స్థాయిలో చమురు, గ్యాస్ లేదా ఇతర హైడ్రోకార్బన్లను దిగుమతి చేసుకుంటున్న దేశాల నుంచి అమెరికాకు వచ్చే వస్తువులపై 100 శాతం వరకు దిగుమతి సుంకాలు విధించే అధికారం ప్రభుత్వానికి లభిస్తుంది. అంతేకాకుండా, రష్యాపై ఇప్పటికే అమల్లో ఉన్న ఆంక్షలను తప్పించుకునేందుకు సహకరిస్తున్న దేశాలు లేదా సంస్థలపై కూడా ఇదే తరహా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా రష్యా ఉపయోగిస్తున్న 'షాడో ఫ్లీట్' కార్యకలాపాలకు సహకరించే దేశాలను కూడా ఈ చట్టం పరిధిలోకి తీసుకురానున్నారు. ప్రతిపాదిత చట్టంలోని సెక్షన్-113 ప్రకారం, రష్యా ఇంధనాన్ని అధికంగా కొనుగోలు చేస్తున్న ఐదు ప్రధాన దేశాలను ప్రత్యేకంగా గుర్తించే అవకాశం ఉంది. ఆ జాబితాలో భారత్, చైనా, స్లోవేకియా, హంగేరీ, అజర్బైజాన్ దేశాలు ఉన్నట్లు సమాచారం. ఈ దేశాల నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే వస్తువులపై అవసరమైతే అధిక సుంకాలు విధించే అధికారం అమెరికా ప్రభుత్వానికి లభించనుంది. అయితే ఈ చర్యలు ఎప్పుడు అమల్లోకి వస్తాయన్నది చట్టం తుది రూపం దాల్చిన తర్వాతే స్పష్టత రానుంది. ఈ ముసాయిదా చట్టం ప్రకారం, రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న ప్రధాన దేశాల జాబితాను ప్రతి 180 రోజులకు ఒకసారి సమీక్షించాలని అమెరికా వాణిజ్య ప్రతినిధికి బాధ్యత అప్పగించారు. ప్రపంచ ఇంధన మార్కెట్‌లో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆయా దేశాలపై అమలు చేసే సుంకాలను సవరించే అవకాశం కూడా ఈ చట్టంలో ఉంది. దీంతో అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌లో పరిస్థితులకు అనుగుణంగా అమెరికా తన వాణిజ్య, ఆంక్షల విధానాన్ని మారుస్తూ ఉండే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఆన్‌లైన్ గేమింగ్ మోసం బట్టబయలు..

కామారెడ్డి : ఆన్‌లైన్ గేమింగ్ పేరుతో అమాయక ప్రజలను పెట్టుబడుల పేరుతో మోసం చేస్తున్న ఇద్దరు నిందితులను రామారెడ్డి పోలీసులు చాకచక్యంగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల వద్ద నుంచి రూ.15 వేల నగదు, ఒక ల్యాప్‌టాప్, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర వెల్లడించారు. వాట్సాప్ ద్వారా ఆన్‌లైన్ గేమింగ్ లింకులు పంపిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు రామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్ పర్యవేక్షణలో కామారెడ్డి రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రామన్, రామారెడ్డి ఎస్ఐ మురళి నేతృత్వంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారాన్ని విశ్లేషిస్తూ గాలింపు చేపట్టి నిందితులను పట్టుకున్నారు. దర్యాప్తులో భాగంగా కామారెడ్డి బస్టాండ్ వద్ద విశాఖపట్నం వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించారు. ప్రధాన నిందితుడు భూక్యా నవీన్ అలియాస్ నరేష్ విదేశాల్లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్న సమయంలో ఖీఠబతీవ9.ఝీఎ అనే ఆన్‌లైన్ గేమింగ్ వెబ్‌సైట్‌కు సంబంధించిన వివరాలు, మొబైల్ నంబర్ల డేటాను సేకరించినట్లు అంగీకరించాడు. భారతదేశానికి తిరిగి వచ్చిన అనంతరం వాట్సాప్ ద్వారా పలువురికి ఆన్‌లైన్ గేమింగ్ లింకులు పంపించి, "పెట్టుబడి పెడితే రెట్టింపు లాభాలు వస్తాయి" అని నమ్మించి మోసాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. బాధితులకు యూజర్ ఐడీలు సృష్టించి వెబ్‌సైట్‌లో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించేవారని, వెబ్‌సైట్‌లో నేరుగా చెల్లింపులు జరగని సందర్భాల్లో తమ యూపీఐ క్యూఆర్ కోడ్ ద్వారా నగదు స్వీకరించి సంబంధిత వెబ్‌సైట్‌లో జమ చేసేవారని పోలీసులు తెలిపారు. ఇందుకు ప్రతిఫలంగా వారికి ఐదు శాతం కమిషన్ అందినట్లు దర్యాప్తులో తేలింది. ప్రాథమిక విచారణలో ఈ వెబ్‌సైట్ ద్వారా దేశవ్యాప్తంగా అనేక మంది మోసపోయినట్లు గుర్తించారు. అరెస్టైన నిందితులు భూక్యా నవీన్ అలియాస్ నరేష్, భూక్యా ప్రవీణ్ ఇద్దరూ రామారెడ్డి మండలానికి చెందినవారని ఎస్పీ తెలిపారు. వారి వద్ద నుంచి ఒక ల్యాప్‌టాప్, నాలుగు మొబైల్ ఫోన్లు, రూ.15 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు కొనసాగిస్తున్నాయని, కేసుపై మరింత లోతుగా దర్యాప్తు జరుగుతోందని వెల్లడించారు. ఈ కేసును ఛేదించడంలో విశేష కృషి చేసిన కామారెడ్డి రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రామన్, రామారెడ్డి ఎస్ఐ మురళి, సైబర్ క్రైమ్ ఎస్ఐ నరేష్‌తో పాటు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర మాట్లాడుతూ, ఆన్‌లైన్ గేమింగ్, పెట్టుబడులు, ట్రేడింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, క్యాష్‌బ్యాక్, రెట్టింపు లాభాలు వంటి పేర్లతో వాట్సాప్, టెలిగ్రామ్, సోషల్ మీడియా ద్వారా వచ్చే గుర్తుతెలియని లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని సూచించారు. తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని చెప్పే వెబ్‌సైట్లు, యాప్‌లను గుడ్డిగా నమ్మి నగదు పంపడం వల్ల భారీ ఆర్థిక నష్టాలు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు.

## రాష్ట్రాభివృద్ధికి మరిన్ని నిధులివ్వండి



హైదరాబాద్: రాష్ట్రానికి అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో మరిన్ని నిధులు కేటాయించాలని బీజేపీ ఎంపీలు కోరారు. ఢిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావు, గోడెం నగేశ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు వివిధ పథకాల కింద తెలంగాణకు భారీగా నిధులు కేటాయించాలని విజ్ఞప్తిచేశారు. తెలంగాణలో నేటికీ అనేక మారుమూల పల్లెలకు సరైన రోడ్డు రవాణా సదుపాయాలు లేవని కేంద్రమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. గిరిజన తండాలకు, ఆదివాసీ ప్రాంతాలకు రోడ్డు కనెక్టివిటీ మెరుగుపరచాలని, మండల కేంద్రాల నుంచి గ్రామ పంచాయతీల్లో రోడ్ల విస్తరణ చేపట్టాలని కోరారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద అనేక గ్రామ పంచాయతీలలో రోడ్ల అభివృద్ధి పనులు జరిగాయని, భవిష్యత్‌లో కూడా రాష్ట్రానికి గ్రామీణ రహదారులను మంజూరు చేయాలని విజ్ఞప్తిచేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద అర్హులైన పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కల సాకారం చేసేందుకు భారీ సంఖ్యలో ఇండ్లను మంజూరుచేయాలని, మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి మరింత సహకారం అందించాలని విన్నవించారు. ఈ విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్టు ఎంపీలు పేర్కొన్నారు.

## సర్ ప్రక్రియను వేగవంతం చేయాలి




హైద్రాబాద్: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) పురోగతి, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియలను వేగవంతం చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) కార్యదర్శి నవీన్ కుమార్ అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌తో పాటు నగరంలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల ఈఆర్‌ఓలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ తర్వాత అధిక సంఖ్యలో నోటీసులు జారీ అయితే, దరఖాస్తుల వేగవంతమైన పరిషారం కోసం అదనపు ఏఈఆర్‌ఓలను (ఏఈఆర్వోలు) విధుల్లోకి తీసుకోవాలని సూచించారు. సమీక్షా సమావేశం అనంతరం నవీన్ కుమార్ క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. అమీర్‌పేట్ అసెంబ్లీ నియోజకవర్గంలోని శివభాగ్‌లో ఉన్న 139వ పోలింగ్ కేంద్రాన్ని, సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని సుమన్ హౌసింగ్ కాలనీలోని 81వ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియను రెండు రోజుల్లో పూర్తిచేయాలని భారత ఎన్నికల కమిషన్(ఈసీఐ) సెక్రటరీ నవీన్ కుమార్ అధికారులను ఆదేశించారు. సర్ పురోగతిపై మేడ్చల్ కలెక్టరేట్‌లో కలెక్టర్ మను చౌదరి, ఇతర ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. అధికారులు బాగా పనిచేస్తున్నప్పటికీ ఇతర జిల్లాలతో పోలిస్తే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సర్ ప్రక్రియలో వెనుకబడి ఉందని అన్నారు. గడువును సద్వినియోగం చేసుకొని సర్ ప్రక్రియను వీలైనం త్వరగా పూర్తిచేయాలని సూచించారు. అనంతరం మేడ్చల్ నియోజకవర్గంలోని తిమ్మాయిపల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దూలపల్లిలలో సర్ ప్రక్రియ తీరును నీవన్ కుమార్ పరిశీలించారు. అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డీఆర్‌ఓ మాలతి, అధికారులు వెంకట్ రెడ్డి, సంచిత్ గంగ్వార్, పింకేష్ కుమార్, రాధికా గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో కొత్త రైల్వే లైన్






హైద్రాబాద్: దక్షిణ భారతదేశంలో అత్యంత ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి వచ్చే లక్షలాది మంది భక్తుల దశాబ్దాల నిరీక్షణకు త్వరలోనే తెరపడనుంది. భద్రాచలాన్ని తొలిసారిగా భారత రైల్వే మ్యాప్‌లోకి తీసుకువస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టినపాండురంగాపురం - భద్రాచలం - మల్కన్‌గిరి నూతన రైల్వే ప్రాజెక్టు పూర్తి వివరాలు తాజాగా వెల్లడయ్యాయి. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రత్యేక రైల్వే ప్రాజెక్టుగా ప్రకటించింది. ఈ మార్గాన్ని రూ. 2,864 కోట్ల అంచనా వ్యయంతో అత్యాధునిక ఇంజనీరింగ్ ప్రమాణాలతో నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టును ప్రయాణికుల భద్రత, గరిష్ఠ వేగానికి ప్రాధాన్యమిస్తూ ప్రత్యేకంగా డిజైన్ చేశారు. భవిష్యత్తులో రైళ్లు గంటకు 160 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా ట్రాక్ నాణ్యతను రూపకల్పన చేస్తున్నారు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాండురంగాపురం నుంచి ప్రారంభమై భద్రాచలం మీదుగా.. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా గుండా ప్రయాణించి ఒడిశాలోని పలు జిల్లాలను కలుపుతూ మల్కన్‌గిరి వరకు ఈ రైలు మార్గం సాగుతుంది. ఈ మూడు రాష్ట్రాల పరిధిలో ప్రాజెక్టు నిర్మాణం కోసం మొత్తం 843.9 హెక్టార్ల భూమి అవసరమని రైల్వే శాఖ ప్రాథమికంగా గుర్తించింది. రైల్వే లైన్ నిర్మాణంలో ఎక్కడా ఒక్క లెవెల్ క్రాసింగ్ కూడా ఉండకపోవడం దీని ప్రత్యేకత. ప్రయాణ వేగాన్ని పెంచడంతో పాటు ప్రమాద రహిత ప్రయాణాన్ని అందించేందుకు గాను మార్గమంతటా 300కి పైగా చిన్న, పెద్ద వంతెనలు, 41 రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, 66 రైల్వే అండర్ బ్రిడ్జిలను నిర్మించనున్నారు. ముఖ్యంగా భద్రాచలం సమీపంలో పవిత్ర గోదావరి నదిపై నిర్మించబోయే భారీ రైల్వే వంతెన ఈ ప్రాజెక్టుకే ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఈ కొత్త మార్గం రాకతో ప్రస్తుతం తీవ్ర రద్దీతో ఉన్న వరంగల్ - విజయవాడ - విశాఖపట్నం - భువనేశ్వర్ ప్రధాన రైల్వే మార్గానికి అద్భుతమైన ప్రత్యామ్నాయం లభిస్తుంది. దీనివల్ల ఉత్తర, తూర్పు భారతదేశాలకు రవాణా కనెక్టివిటీ గణనీయంగా మెరుగుపడుతుంది. ముఖ్యంగా దక్షిణాదిలోని వివిధ థర్మల్ పవర్ స్టేషన్లకు బొగ్గు రవాణా సులువుగా, వేగంగా జరుగుతుంది. అంతేకాకుండా.. పరిసర ప్రాంతాల్లోని అల్యూమినియం, ఇనుప ఖనిజ పరిశ్రమల ముడిసరుకు రవాణాకు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వ్యవసాయ ఉత్పత్తులను దేశవ్యాప్తంగా ఇతర మార్కెట్లకు వేగంగా చేరవేయడానికి ఈ రైలు మార్గం ఒక రవాణా వంతెనగా ఉపయోగపడనుంది. రాబోయే ఐదేళ్ల కాలపరిమితిలో ఈ ప్రాజెక్టును పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని రైల్వే శాఖ లక్ష్యంగా పెట్టుకుంది.

## వర్షపు నీటి నిల్వ సమస్య పరిష్కరించాలి

గజ్వేల్,: ప్రజా సమస్యల పరిష్కారమే భారతీయ జనతా పార్టీ ధ్యేయమని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. గజ్వేల్‌ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ 15వ వార్డు తూప్రాన్ రోడ్డు, హెచ్పీ పెట్రోల్ బంక్ వెనుక ఉన్న కాలనీలో ప్రతి సంవత్సరం వర్షపు నీరు నిలిచిపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరుతూ జీపీపీ మున్సిపల్ 15వ వార్డు బీజేపీ నాయకుడు జోడు ప్రకాష్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్కు, మున్సిపల్ చైర్మన్కు వినతిపత్రం అందజేశారు. ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులు కోరారు. త్వరలోనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ పట్టణ బీజేపీ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్ యాదవ్, బీజేపీ ఎస్సీ మోర్చా సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నత్తి శివకుమార్, గజ్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శి నాయిని సందీప్ కుమార్, సీనియర్ నాయకులు వెంకటేష్, గడియారం రాజేశ్వర్ చారి తదితరులు పాల్గొన్నారు.

## బీఎల్ఏల సహకారంతో సర్ ప్రక్రియ పూర్తి

నిర్మల్ : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ బి ఎల్ ఎ ల సమక్షంలో సమగ్ర ఓటర్ల సార్ ప్రక్రియ పూర్తి చేస్తున్నట్టు ఉర్దూ అకాడమీ రాష్ట్ర తాహెర్ బిన్ అహ్మద్, పార్లమెంట్ ఇంచార్జ్ మోహన్ తెలిపారు. నిర్మల్ నియోజకవర్గం సరిపక్రియ బి ఎల్ ఏ గా పనితీరుపై సమీక్ష నిర్వహించారు. అన్ని పోలింగ్ బూతులు కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో కష్టపడి పని చేస్తారని తెలిపారు. అరులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని అలాగే అర్హత లేని ఓటర్లను తొలగించాలని పిలుపునిచ్చారు. ఓటర్ల ప్రక్రియ తుది జాబితా ప్రకటించే వరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీహరి రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ ఆది, సోమ భీమారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎంబరి రాజేశ్వర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కుటుంబ ధ్రువీకరణ పత్రం అందుబాటులోకి



హైద్రాబాద్: రాష్ట్ర ప్రజలు తమ కుటుంబ సభ్యుల వివరాలను ఏ ప్రభుత్వ లేదా ప్రైవేట్ సంస్థ అడిగినప్పుడు సులభంగా సమర్పించేందుకు వీలుగా ప్రభుత్వం లిలి'కుటుంబ ధ్రువీకరణ పత్రం 'లిలిను అందుబాటులోకి తీసుకువచ్చిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ వైస్ చైర్మన్ ఫహీమ్ ఖురేషీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ, సన్నబియ్యం తదితర సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు సేవలు అందిస్తోందని తెలిపారు. ఈ పథకాల అమలులో భాగంగా రాష్ట్రంలోని కుటుంబాల సభ్యుల వివరాలు ఇప్పటికే ప్రభుత్వ వద్ద నమోదై ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలోని ఏ కుటుంబమైనా తమ కుటుంబ వివరాలు లేదా కుటుంబ సభ్యుల సమాచారం అవసరమైనప్పుడు సమీప తహసీల్దార్ కార్యాలయం లేదా మీ సేవ కేంద్రాన్ని సందర్శించి కుటుంబ ధ్రువీకరణ పత్రం పొందవచ్చని ఆయన తెలిపారు. భవిష్యత్తులో ఏదైనా ప్రభుత్వ శాఖ, విద్యాసంస్థ లేదా ఇతర సంస్థలు కుటుంబ సభ్యుల వివరాలు కోరినప్పుడు ఈ కుటుంబ ధ్రువీకరణ పత్రం ఉపయోగపడుతుందని, ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు.

## అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్




జహీరాబాద్, : వైన్స్ షాపుల్లో, ఇండ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు చిరాగ్ పల్లి ఎస్ ఐ రాజశేఖర్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం మొగుడంపల్లిలోని రేణుక ఎల్లమ్మ వైన్ షాప్, ఇండ్లలో జరిగిన దొంగతనం కేసుకు సంబంధించిన నిందితులను అరెస్ట్ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా ఎస్పీ పంకజ్ పరితోష్ ఉత్తర్వులు, జహీరాబాద్ డీఎస్పీ సైదానాయక్ సూచనలతో జహీరాబాద్ సిఐ శివలింగం ఆధ్వర్యంలో చిరాకుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని దొంగతనాలకు పాల్పడిన వారిని సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా బృందాలుగా దర్యాప్తును చేపట్టామన్నారు. తన బృందం పూణే నగరానికి వెళ్లి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. మిగతా ముగ్గురు పరారీలో ఉన్నారని తెలిపారు. అరెస్ట్ చేసిన వారిలో రాహుల్ నందు రాథోడ్, జోక్ రాజ్ కురుదర్సింగ్ బిరావత్ ను అరెస్ట్ చేశామన్నారు. వర్ధమాన్, దక్ష,, శుక్రాచారి పరారీలో ఉన్నారని తెలిపారు. మొగుడంపల్లి వైన్ షాప్ తో పాటు పలు ఇండ్లలో దొంగతనం చేయడమే కాకుండా అల్గోల్, జహీరాబాద్, ఝురాసంగం పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు దొంగతనాలలో వీరి ప్రమేయం ఉందని దర్యాప్తులో వెల్లడైందన్నారు. వీరిని కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం వారిని రిమాండ్కు పంపించిందన్నారు. ఈ కేసును ఫలితాలు ఛేదించి నిందితులను అరెస్టు చేయడంలో విశేష ప్రతిభ కనబరిచిన వారిని ఈ కేసును ఛేదించిన ఎస్.ఐ రాజశేఖర్, జహీరాబాద్ రూరల్ ఎస్సై రాజేందర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ హోమ్దేవ్ రాకేష్, హరినేత్ర, ఆనంద్లను ప్రశంసించారు.

## రష్యా నుంచి రెట్టింపైన చమురు దిగుమతులు

న్యూఢిల్లీ : పశ్చిమాసియాలో కొనసాగుతున్న భౌగోళిక ఉద్రిక్తతల మధ్య రష్యా ముడి భారత్ చమురు కొనుగోళ్లను రికార్డ్ స్థాయిలో పెంచింది. జులై నెలలో రష్యా నుంచి రోజుకు 2.78 మిలియన్ బ్యారెల్స్ ముడి చమురు దిగుమతి జరిగింది. ఇప్పటి వరకు జరిగిన దిగుమతుల్లో ఇదే ఆల్‌టైం రికార్డ్‌గా నిలిచింది. దేశం మొత్తం దిగుమతుల్లో రష్యా వాటా 55.3 శాతానికి చేరగా.. జూన్‌తో పోలిస్తే రష్యా సరఫరా 1.8 శాతం పెరిగింది. మొత్తం దిగుమతులు స్వల్పంగా మాత్రమే పెరిగినప్పటికీ రష్యా ప్రధాన సరఫరాదారుగా తన ఆధిపత్యాన్ని మరింత బలోపేతం చేసుకుంది. ఈఏడాది జనవరిలో 23.4 శాతంగా ఉన్న రష్యా వాటా.. ప్రస్తుతం రెండింతలకు పైగా పెరిగి 55 శాతాన్ని దాటడం విశేషం. రష్యా చమురు సరఫరా పెరగడానికి పలు అంతర్జాతీయ పరిణామాలు కారణమయ్యాయి. ఉక్రెయిన్ డ్రోన్ దాడులతో రష్యా రిఫైనింగ్ కార్యకలాపాలు దెబ్బతినడంతో ఎగుమతికి ఎక్కువ ముడి చమురు దుబాటులోకి వచ్చింది. అలాగే అమెరికా-- ఇరాన్ ఉద్రిక్తతలు తాత్కాలికంగా తగ్గిన సమయంలో గల్ఫ్ ప్రాంతంలో నిలిచిపోయిన నౌకలు మళ్లీ ప్రయాణం ప్రారంభించడంతో భారత్‌కు సరఫరా సులభమైంది. రష్యా ఇచ్చే డిస్కౌంట్లు బ్యారెల్‌కు కేవలం 2--3 డాలర్లకు తగ్గినా భారత రిఫైనర్లు కొనుగోళ్లు తగ్గించలేదు. పశ్చిమాసియా దేశాల నుంచి కూడా దిగుమ తులు జులైలో కొంత పెరిగాయి. యుఎఇ రోజుకు 4.89 లక్షల బ్యారెల్స్‌తో రెండో అతిపెద్ద సరఫ రాదారుగా నిలిచినప్పటికీ జూన్‌తో పోలిస్తే దాని సరఫరా తగ్గింది. సౌదీ అరేబియా నుంచి దిగుమ తులు మాత్రం 55 శాతం పెరిగి రోజుకు 4.53 లక్షల బ్యారెల్స్‌కు చేరాయి. మరోవైపు అట్లాంటిక్ ప్రాంత దేశాల నుంచి దిగుమతులు తగ్గుముఖం పట్టాయి. వెనిజులా, బ్రెజిల్, అమెరికా నుంచి ముడి చమురు కొనుగోళ్లు గణనీయంగా తగ్గగా, నైజీరియా నుంచి మాత్రం దిగుమతులు పెరిగాయి. దీంతో భారత చమురు దిగుమతుల్లో రష్యాపై ఆధారపడటం మరింత స్పష్టంగా కనిపిస్తోంది.

## భారీగా పెరిగిన పత్తి మక్కల రేట్లు

హైద్రాబాద్: వరంగల్ వ్యవసాయ మార్కెట్లో పత్తి మక్కల ధరలు అకస్మాత్తుగా పెరగడంతో రైతుల్లో చర్చ మొదలైంది. తాజా మార్కెట్ వివరాల ప్రకారం వరంగల్ మార్కెట్ లో క్వింటా పత్తి ధర రూ.9350 పలకగా, మక్కల ధర రూ.2550కి చేరింది. గత కొన్ని రోజులుగా మార్కెట్లో పత్తి ధర క్రమంగా పెరుగుతూ వస్తోంది. ముఖ్యంగా గత బుధవారం నాడే క్వింటా పత్తి ధర రూ.9400 వరకు పలికింది. ఈ ధరల పెరుగుదల చూసి అన్నదాతలు ఆశ్చర్యపోతున్నారు. మార్కెట్లో పంటల ధరలు రోజురోజుకు పెరుగుతుండడం సంతోషకరమైన విషయమే అయినా, రైతుల పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. అన్నదాతలు తాము కష్టపడి పండించిన పత్తి అలాగే మక్కలను ఇప్పటికే తొంభై తొమ్మిది శాతం వరకు అమ్ముకున్నారు. తమ వద్ద పంట నిల్వలు పూర్తిగా అయిపోయిన తర్వాత మార్కెట్లో ధరలు విపరీతంగా పెరగడం పట్ల రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు ఈ ధరలు కనీసం రెండు నెలల ముందే పెరిగి ఉంటే తమకు మంచి లాభాలు వచ్చి ఉండేవి అని వాపోతున్నారు.

# ఆయిల్ పామ్ విస్తరణలో అలసత్వం సహించం



హైద్రాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఆయిల్ పామ్ సాగు విస్తరణ కార్యక్రమంలో నిర్లక్ష్యం, అలసత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనలో విఫలమవుతున్న ఆయిల్ పామ్ కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్‌ను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ఆయిల్ పామ్ కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ఈ ఏడాది రాష్ట్రంలో 85 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటివరకు కేవలం 17,090 ఎకరాల్లో మాత్రమే సాగు నమోదైందని తెలిపారు. ఇది లక్ష్యంలో సుమారు 20 శాతం మాత్రమే కావడం తీవ్ర నిరాశ కలిగించే అంశమని పేర్కొన్నారు. ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తున్నప్పటికీ కంపెనీలలో ఆశించిన స్థాయిలో చిత్తశుద్ధి కనిపించడం లేదని మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతులు పెద్ద ఎత్తున ఆసక్తి చూపుతున్నప్పటికీ కంపెనీలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. పనితీరు సరిగా లేని కంపెనీలకు ఇప్పటికే పలుమార్లు నోటీసులు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. జగిత్యాల జిల్లాలోని లోహియా కంపెనీ, గద్వాల, నారాయణపేట, జనగామ జిల్లాల్లో పనిచేస్తున్న ఆయిల్ ఫెడ్‌కు నాలుగుసార్లు నోటీసులు ఇచ్చినట్లు వెల్లడించారు. అలాగే పెద్దపల్లి జిల్లాలోని తిరుమల కంపెనీ, భూపాలపల్లి, ములుగు, వనపర్తి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో పనిచేస్తున్న ప్రియూనిక్ కంపెనీ, హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోని రామ్ చరణ్ కంపెనీకి మూడుసార్లు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలోని గోద్రెజ్ కంపెనీకి రెండుసార్లు నోటీసులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. విశ్వతేజ్ కంపెనీకి ఐదుసార్లు, కేన్ బయోకు ఆరుసార్లు, పతంజలికి ఆరుసార్లు, మాట్రిక్స్‌కు ఐదుసార్లు, సువేన్ ఆగ్రోకు మూడుసార్లు నోటీసులు ఇచ్చినా పనితీరులో ఆశించిన మార్పు కనిపించలేదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పతంజలి, లోహియా, కేన్ బయో, మాట్రిక్స్ కంపెనీల పరిధిలోని కొన్ని జిల్లాలను గతంలోనే తొలగించి ఇతర కంపెనీలకు అప్పగించినప్పటికీ పరిస్థితి మారలేదని మంత్రి తెలిపారు. ఇకపై లక్ష్య సాధనలో వెనుకబడిన కంపెనీలకు కేటాయించిన జిల్లాలను తగ్గించడానికైనా, పూర్తిగా తొలగించడానికైనా ప్రభుత్వం వెనుకాడదని స్పష్టం చేశారు. మెరుగైన పనితీరు కనబరిచే సంస్థలకు అదనపు జిల్లాలు కేటాయించే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఆయిల్ ఫెడ్‌కు కూడా ఎలాంటి మినహాయింపు ఉండదని, పనితీరు మెరుగుపడకపోతే దాని పరిధిలోని జిల్లాలను కూడా ఇతర సంస్థలకు అప్పగిస్తామని హెచ్చరించారు. ఆగస్టు నెలలో మొక్కల కొరత ఏర్పడే అవకాశం ఉన్న కంపెనీలు ఇతర సంస్థల నుంచి మొక్కలు కొనుగోలు చేసి రైతులకు సకాలంలో అందించాలని మంత్రి ఆదేశించారు. రైతులు మొక్కలు కోరిన వెంటనే అందించేలా ప్రతి కంపెనీ సిద్ధంగా ఉండాలని, మొక్కల కొరత పేరుతో ఒక్క రైతు కూడా వేచి చూడాల్సిన పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. కంపెనీల ఫీల్డ్ సిబ్బంది గ్రామస్థాయిలో అందుబాటులో ఉండి ఆయిల్ పామ్ సాగు యాజమాన్య పద్ధతులు, ఎరువుల వినియోగం, నీటి నిర్వహణ, పంట సంరక్షణ తదితర అంశాలపై రైతులకు నిరంతరం అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్ల పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. యూనిట్లు త్వరగా అందుబాటులోకి వస్తే రైతుల రవాణా భారం తగ్గడంతో పాటు పంటకు సకాలంలో ప్రాసెసింగ్ సౌకర్యం లభిస్తుందని పేర్కొన్నారు. అందువల్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి రైతులకు త్వరగా సేవలు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత కంపెనీలకు సూచించారు.

# ఎన్టీఆర్ , నెల్సన్... సాధ్యమవుతుందా?





జైలర్ తర్వాత దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ పేరు ఏ స్థాయిలో సౌత్ మొత్తం మారుమ్రోగిపోయిందో అభిమానులు అంత సులభంగా మర్చిపోలేరు. సూపర్ స్టార్ రజనీకాంత్ వరస ఫ్లాపులతో ఉన్నప్పుడు ఆయనకంత పెద్ద బ్లాక్ బస్టర్ ఇవ్వడం చిన్న విషయం కాదు. అందుకే జైలర్ 2 కూడా ఓకే అయిపోయి అక్టోబర్ విడుదలకు రెడీ అవుతోంది. అయితే సితార సంస్థకు తనో కమిట్ మెంట్ ఇచ్చాడు. అది కూడా జూనియర్ ఎన్టీఆర్ హీరోగా ఒక పెద్ద ప్యాన్ ఇండియా మూవీ తీయాలనే ప్లాన్ తో. ఇదంతా గతం. ఇప్పుడు వర్తమానంలోకి వద్దాం. నెల్సన్ దిలీప్ కుమార్ జైలర్ 2 పూర్తి చేసిన వెంటనే రజనీకాంత్ కమల్ హాసన్ మల్టీస్టారర్ పనులు మొదలుపెట్టాలి. ఇది ఆషామాషీ సినిమా కాదు. 38 సంవత్సరాల తర్వాత ఇద్దరు దక్షిణాది లెజెండ్స్ స్క్రీన్ పంచుకోబోతున్నారు. దానికి తగ్గట్టే సెటప్, స్క్రిప్ట్ ఉండాలి. కొంచెం ఎక్కువ సమయం అవసరం పడేలా ఉండటంతో ఈలోగా ధర్మన్ పూర్తి చేసుకుందామని రజని అందులో బిజీ అయ్యారు. డిసెంబర్ కంతా ఫ్రీ అయిపోతారు. ఈ లెక్కన రజని కమల్ మూవీ 2028లో రిలీజ్ అవుతుంది. అంతకన్నా ముందు కష్టమే. ఇక జూనియర్ ఎన్టీఆర్ విషయానికి వస్తే డ్రాగన్ అయిపోయాక త్రివిక్రమ్ తో ప్యాన్ వరల్డ్ ఫాంటసీ మూవీ అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనికి ఎంత సమయం పడుతుందో చెప్పలేం. కమర్షియల్ కథలకే ఎక్కువ టైం తీసుకునే మాటల మాంత్రికుడు ఇప్పుడీ విజువల్ గ్రాండియర్ కి ఎంత సమయం అడుగుతారో తెలియదు. ఇది కూడా ఇంచుమించు 2028 కంటే ముందు వచ్చే ఛాన్స్ లేదు. సో ఈ కలయిక కార్యరూపం దాల్చాలన్నా రెండు సంవత్సరాలకు పైగా వెయిట్ చేయాల్సిందే. నాగవంశీ అయితే ఈ కాంబినేషన్ వదలను అనే పట్టుదల చూపిస్తున్నారు. మరి నెల్సన్ ఏమంటారో చూడాలి. ఎలాగూ జైలర్ 2 ప్రమోషన్స్ టైంలో బయటికి వస్తారు కాబట్టి అప్పుడేమైనా క్లారిటీ ఇస్తారేమో. తమిళ డైరెక్టర్లు ఈ మధ్య తెలుగు స్టార్లతో పని చేయడానికి ఉవ్విళ్లూరుతున్నారు. నెల్సన్ కూడా అదే రీతిలో టెంప్ట్ అయినట్టు ఉన్నాడు. తారక్ కోసం ఎలాంటి కథ రాసుకున్నాడో.

# తెలంగాణలో వైన్ టూరిజం అభివృద్ధికి అవకాశాల అన్వేషణ



హైద్రాబాద్: తెలంగాణలో వైన్ టూరిజం అభివృద్ధికి ఉన్న అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తోందని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. అమెరికా పర్యటనలో భాగంగా వర్జీనియా రాష్ట్రంలోని లీస్‌బర్గ్‌లో ఉన్న స్టోన్ టవర్ వైన్‌రీని సందర్శించిన మంత్రి అక్కడి వైన్ తయారీ విధానాలు, నిర్వహణను పరిశీలించారు. వైన్‌రీలో నిర్వహించిన సెల్లార్ టూర్‌లో పాల్గొన్న మంత్రి, ద్రాక్ష సాగు నుంచి వైన్ తయారీ, ప్రాసెసింగ్, ఫెర్మెంటేషన్, నిల్వ, బాట్లింగ్, నాణ్యత ప్రమాణాలు, మార్కెటింగ్ తదితర అంశాలపై వైన్‌రీ ప్రతినిధులతో చర్చించారు. అలాగే ద్రాక్ష తోటలు, వైన్‌రీలను పర్యాటక రంగంతో అనుసంధానం చేసి సందర్శకులకు ప్రత్యేక అనుభూతిని ఎలా కల్పిస్తున్నారో అధ్యయనం చేశారు. అమెరికా పర్యటనలో భాగంగా వర్జీనియాలోని అష్‌బర్న్ ప్రాంతంలోని మరో వైన్‌రీని కూడా సందర్శించి అక్కడి నిర్వహణ విధానాలను పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ, హైదరాబాద్‌కు సమీపంలోని రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ద్రాక్ష తోటలు, వైన్‌రీల ఆధారంగా వైన్ టూరిజం అభివృద్ధి చేసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులు, ద్రాక్ష సాగుకు అనుకూలత, భూముల ఎంపిక, పెట్టుబడి అవకాశాలు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి ముందుకు సాగుతామని చెప్పారు. వైన్ టూరిజం అభివృద్ధి ద్వారా పర్యాటకులకు కొత్త అనుభవం లభించడంతో పాటు ద్రాక్ష రైతులకు ప్రోత్సాహం, ప్రైవేట్ పెట్టుబడుల ఆకర్షణ, స్థానికంగా ఉపాధి అవకాశాల సృష్టి జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ పర్యాటక విధానం 2025--30లో భాగంగా వినూత్న పర్యాటక ఉత్పత్తుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఇటీవల నిర్వహించిన తెలంగాణ టూరిజం కాన్‌క్లేవ్‌లో రూ.15 వేల కోట్లకు పైగా పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చినట్లు గుర్తుచేశారు. రాష్ట్రంలో తొలి విన్యార్డ్ రిసార్ట్తో పాటు వైన్‌రీ వాక్‌త్రూ అనుభవం కల్పించే ప్రాజెక్టుకు కూడా ప్రతిపాదనలు వచ్చినట్లు వెల్లడించారు. ఇందులో ద్రాక్ష సాగు నుంచి వైన్ తయారీ, బాట్లింగ్ వరకు మొత్తం ప్రక్రియను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం, సంప్రదాయ 'గ్రేప్ స్టాంపింగ్' అనుభవాన్ని కూడా పర్యాటకులకు అందించేలా ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు. అంతర్జాతీయంగా విజయవంతమైన వైన్ టూరిజం నమూనాలు, ఉత్తమ విధానాలను అధ్యయనం చేసి, ద్రాక్ష తోటలు, వైన్‌రీలు, హాస్పిటాలిటీ, స్థానిక వంటకాలతో అనుసంధానించి తెలంగాణకు అనువైన వైన్ టూరిజం నమూనాను అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలిస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. మంత్రి వెంట ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొండాపూర్‌లో సౌత్ ఇండియన్ బ్యాంక్



హైదరాబాద్, : అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణ మార్కెట్లలో తమ వ్యాపార విస్తరణ వ్యూహాన్ని కొనసాగిస్తూ, సౌత్ ఇండియన్ బ్యాంక్ నేడు దేశంలోని ప్రముఖ బిజినెస్, టెక్నాలజీ హబ్‌లలో ఒకటైన కొండాపూర్‌లోని గచ్చిబౌలి రోడ్‌లో సరికొత్త బ్రాంచ్, ఏటీఎంను ప్రారంభించింది. ఈ నూతన బ్రాంచ్‌ను ప్రముఖ పారిశ్రామికవేత్త ఎన్. అఖిలేష్ రెడ్డి, బ్రాంచ్ ప్రాంగణంలోని ఏటీఎంను హార్టికల్చర్ (కేవీకే ఐసీఏఆర్ భారత ప్రభుత్వం) మాజీ శాస్త్రవేత్త డాక్టర్ సదానందం దాసరి, ఆన్‌సైట్ స్ట్రాంగ్ రూమ్‌ను భవన యజమాని ఉట్ల కృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సౌత్ ఇండియన్ బ్యాంక్ ఇండిపెండెంట్ డైరెక్టర్ లక్ష్మి రామకృష్ణ శ్రీనివాస్, బ్యాంక్ ఉన్నతాధికారులు హాజరయ్యారు. కాగా హైదరాబాద్ వెస్ట్రన్ కారిడార్‌లోని వ్యూహాత్మక ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఈ బ్రాంచ్.. శరవేగంగా విస్తరిస్తున్న గచ్చిబౌలి, కొండాపూర్ పరిసర ప్రాంతాల రిటైల్ కస్టమర్లు, ఎంఎస్‌ఎంఈ లు, నూతన పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ సంస్థలు, స్థానిక నివాసితుల బ్యాంకింగ్ అవసరాలను తీర్చడానికి కస్టమర్-సెంట్రిక్ విధానంతో పూర్తి స్థాయి బ్యాంకింగ్ ఉత్పత్తులు, సేవలను ఈ బ్రాంచ్ అందించనుంది.

# విశ్వంభరకు అసలు ఇరకాటం అదే



రెండు సంవత్సరాలకు పైగా మోక్షం కోసం ఎదురు చూస్తున్న విశ్వంభర విడుదలకు ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ఇప్పటికే ఆలస్యం వల్ల హైప్ తగ్గిపోగా దాన్ని మళ్ళీ పూర్వ స్థితికి తేవాలంటే భారీ స్థాయిలో ప్రమోషన్లు చేయాల్సి ఉంటుంది. దాని కోసం చిరంజీవి ప్రత్యేకంగా సమయం కేటాయించడంతో పాటు అన్నీ దగ్గరుండి చూసుకోవాలి. రిలీజ్ డేట్ ఇంకా నిర్ణయించలేదు కానీ యూనిట్ దసరా పండగను టార్గెట్ చేసుకోవాలని చూస్తోంది. ఇటీవలే ఈ టాక్ బయటికొచ్చింది. అసలు ఇరకాటం వేరే ఉంది. అక్టోబర్ 15 రజనీకాంత్ జైలర్ 2 ప్రకటించారు. దాంతో క్లాష్ అయితే పక్క రాష్ట్రాల్లో విశ్వంభరకు సరైన రిలీజ్ దక్కదు. ముఖ్యంగా తమిళనాడు, కేరళలో స్క్రీన్లు దొరకవు. కర్ణాటకలో మేనేజ్ చేసుకున్నా రెవిన్యూ మీద ప్రభావం పడుతుంది. అలాని ఏపీ తెలంగాణలో ఏ సమస్య ఉండదని కాదు. రజనీ ఇమేజ్ లో హెచ్చుతగ్గులు ఉండొచ్చు కానీ జైలర్ మీద తెలుగు ఆడియన్స్ లో భారీ ఫాలోయింగ్ ఉంది. మొదటి భాగానికి వచ్చిన వసూళ్లే సాక్ష్యం. దీంతో పోటీ వద్దనుకుని అక్టోబర్ మొదటి వారంలో వద్దామంటే వెంకటేష్ ఆదర్శ కుటుంబం ఇటీవలే కర్చీఫ్ వేసింది. రెండో తేదీ లాక్ చేసుకుంది. దాంతో నేరుగా తలపెడితే ఎవరో ఒకరు ఎఫెక్ట్ అవుతారు. ఒకవేళ వెంకీ మూవీకి టాక్ బాగా వస్తే రెండు మూడు వారాలు థియేటర్లు నింపేస్తాడు. అప్పుడు విశ్వంభర బాగున్నా కూడా కలెక్షన్లు పంచుకోవాల్సి వస్తుంది. ఇదంతా ఎందుకనుకుంటే అక్టోబర్ మూడో వారంకి షిఫ్ట్ అవ్వాలి. కానీ విజయదశమి సెలవులు అయిపోతాయి. ముందైతే విశ్వంభర ఫైనల్ కాపీ చూసుకున్నాక నిర్ణయం తీసుకుందామని చిరంజీవి నిర్మాతలతో చెప్పినట్టుగా సమాచారం. ప్రస్తుతం బాబీ షూటింగ్ లో బిజీగా ఉండటం వల్ల ఇంకా టైం ఫిక్స్ చేయలేదట. రిపేర్లు చేసిన తర్వాత విఎఫెక్స్ పనులు సంతృప్తికరంగా వచ్చాయని అంటున్నారు. ఆగస్ట్ 22 మెగాస్టార్ పుట్టినరోజు రానుంది. మెగా 158 అప్డేట్ ఖచ్చితంగా ఉంటుంది. కానీ విశ్వంభర లేకపోతే బాగుండదు. కనీసం విడుదల తేదీ అయినా పక్కాగా చెబితే అభిమానులు సంతోషపడతారు.

## ఓటు హక్కు కోల్పోతే ప్రభుత్వ పథకాలకు ఇబ్బందులు

సిరిసిల్ల : ఓటు హక్కు కోల్పేతే ప్రభుత్వ సం క్షేమ పథకాలు రావడం ఇబ్బందిగా మారుతుందని, బీఎల్‌వో ఇచ్చిన ఫారాన్ని పట్టణ ప్రజలందరు ఆగస్టు 3 వరకు నింపి బీఎల్‌వోకు ఇవ్వాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ అన్నారు. స్థానిక పద్మశాలి కల్యా ణ భవన్‌లో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సూర దేవరాజు అధ్యక్షతన మున్సిపల్ పరిధిలోని 3, 16, 28 వార్డుల నాయకులు, కార్యకర్తలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంగీతం శ్రీనివాస్, గ్రంథాలయం చైర్మన్ నాగుల సత్యనారాయ ణ మాట్లాడారు. పట్టణ పరిధిలోని అన్ని వార్డుల్లో ఆగస్టు 3లోపు సర్ కార్యక్రమాలను పూర్తిచేయాలని సూచించారు. పట్టణంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రభుత్వం సంక్షేమ పథకాలను అర్హులైన పేద ప్రజలకు అందేలా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బాధ్యతలను తీసుకోవాలన్నారు. ఇళ్లు లేని అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. గత ప్రభుత్వాలు హామీలకే పరిమితమయ్యాయని ఆరోపించారు. కాం గ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిననాటి నుంచి అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రజల ఆదరణను అందుకుంటుందన్నారు. ఈ సమావేశం లో సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనితనళినీకాంత్, చేనేత సెల్ అధ్యక్షుడు గుడిశెట్టి బాలరాజు, అర్బన్ బ్యాంక్ మాజీ వైస్‌చైర్మన్ నీలి రవీందర్, నాయకులు శ్రీగాధ మైసయ్య, గుజ్జె రమేష్, భాస్కర్, దేవదాస్, శివ, ప్రసాద్ పాల్గొన్నారు.

# 33 శాతం కోటాను తక్షణమే అమలు చేయాలి




న్యూఢిల్లీ :పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని మహిళా సంఘాలు డిమాండ్ చేశాయి. 'నేషనల్ కోయిలిషన్ ఫర్ ఉమెన్స్ రిజర్వేషన్స (ఎన్‌సీడబ్ల్యూఆర్) ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద చేపట్టిన ఐక్య ఆందోళన నాటికి పదో రోజుకు చేరుకుంది. ఢిల్లీలోని వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది మహిళలు, అలాగే కేరళ నుంచి వచ్చిన భారీ ప్రతినిధి బృందం రంగురంగుల బ్యానర్లు, ప్లకార్డులు, పోస్టర్లు, జెండాలతో ఆందోళనలో పాల్గొన్నారు. మహిళల రాజకీయ హక్కుల కోసం నిలకడగా పోరాడుతున్న వామపక్ష పార్టీల తరపున మద్దతు, సంఘీభావం తెలిపేందుకు రాజ్యసభ సీపీఐ(ఎం) పక్షనేత జాన్ బ్రిట్టాస్ ఆందోళన ప్రదేశాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ చట్టం అమలును ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్న బీజేపీ ప్రభుత్వ చర్యలను ఆయన 'మనువాద కుట్ర'గా అభివర్ణించారు. పోరాటంతో తమ హక్కులను ఎలా సాధించుకోవాలో దేశంలో మహిళలకు తెలుసునని, ప్రభుత్వాన్ని బాధ్యత నుంచి తప్పించుకోనివ్వరని ఆయన అన్నారు. బీజేపీ ద్వంద్వ వైఖరి ప్రజల ముందు బట్టబయలు అవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ నిరసన సభలో పలు మహిళా సంఘాల ప్రతినిధులు ప్రసంగించారు. వీరిలో ఐద్వా జాయింట్ సెక్రెటరీ, ఢిల్లీ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షురాలు ఆశా శర్మ, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జాతీయ నాయకురాలు మైమూనా మొల్లా, మణిపూర్ నుంచి అరుణ, రహీనా బేగం రాజ్, వైడబ్ల్యూసీఏ నుంచి ప్రజ్ఞ, ఏఐపీడబ్ల్యూఏ నుంచి పూజ తదితరులు ఉన్నారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయడానికి మోడీ ప్రభుత్వం నిరంతరం నిరాకరిస్తుండటంపై వక్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు తగిన ప్రాతినిధ్యం లభించే వరకు పోరాటాన్ని ఉధృతం చేస్తామని వారు పునరుద్ఘాటించారు. ఈ ధర్నాలో పాల్గొన్న సీనియర్ నాయకులలో ఐద్వా అఖిల భారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.కె. శ్రీమతి, కనినిక ఘోష్, జాతీయ కార్యదర్శి సి.ఎస్. సుజాత, ఢిల్లీ రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు ఆశా యాదవ్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ప్రధాన కార్యదర్శి నిషా సిధు, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ నుంచి దీప్తి, సరస్వతి, 'టుగెదర్ ఫర్ ట్రాంక్విలిటీ' నుంచి భావన శర్మ తదితరులు పాల్గొన్నారు. ప్రస్తుత పార్లమెంటు సమావేశాలు ముగిసే వరకు ఈ ఆందోళన ప్రతిరోజూ కొనసాగుతుందని 'నేషనల్ కోయిలిషన్ ఫర్ ఉమెన్స్ రిజర్వేషన్స్' మరోసారి స్పష్టం చేసింది. 33 శాతం రిజర్వేషన్ అమలులో ఇక ఏమాత్రం జాప్యాన్ని దేశవ్యాప్తంగా ఉన్న మహిళలు అంగీకరించబోరని వివరించింది. సమాన రాజకీయ ప్రాతినిధ్యం అనే రాజ్యాంగ హామీ వాస్తవ రూపం దాల్చే వరకు దేశవ్యాప్త ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రతిజ్ఞ చేసింది.

## నిరుపేద విద్యార్థులకు వీ టూ హెల్ప్ చేయూత



నాగల్గిద్ద, : సమాజ సేవే లక్ష్యంగా పనిచేస్తున్న వీ టూ హెల్ప్ యూ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నాగల్గిద్ద మండలంలోని ముక్తపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రూ.45 వేల విలువైన స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు, పెన్సిల్లు, చాక్లు తదితర విద్యా సామగ్రిని విద్యార్థులకు పంపిణీ చేశారు. మొత్తం 66 మంది నిరుపేద విద్యార్థులకు ఈ సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాబూశెట్టి, మండల పిఆర్టియు అధ్యక్షులు శేరీకర్ రమేష్ మాట్లాడుతూ, మారుమూల ప్రాంతంలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం ఎంతో అభినందనీయమన్నారు. ప్రతి సంవత్సరం ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థులకు అండగా నిలవాలని సంస్థ సభ్యులు కృష్ణ ప్రసాద్, అమర్నాథ్లను కోరారు. పాఠశాల తరపున వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు సావిత్రి, దీక్షిత, భాస్కర్, గ్రామ సర్పంచ్ సుభాష్ చంద్రబోస్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ లలిత, ఉపాధ్యాయులు లింగమేశ్వర్, సంగమేశ్వర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మెట్రో ప్రయాణం మరింత సౌకర్యవంతంగా ఉండేలా చర్యలు తీసుకోండి



హైద్రాబాద్: హైదరాబాద్ మెట్రో రైలు ప్రయాణికులు సురక్షితంగా, సులభంగా, సౌకర్యవంతంగా తమ గమ్యస్థానాలకు చేరుకునేలా తగిన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ చైర్మన్‌గా తొలిసారి ఆయన మెట్రో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. తెలంగాణ సచివాలయంలో ఆయన అధ్యక్షతన హెచ్ఎంఆర్ఎల్ బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మెట్రో, టీజీఎస్ఆర్టీసీ వంటి ప్రజా రవాణా వ్యవస్థలన్నింటికీ వర్తించే కామన్ మొబిలిటీ టికెటింగ్ వ్యవస్థను అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ఒకే టికెట్‌తో వివిధ ప్రజా రవాణా సేవలను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా, మెట్రో మరియు టీజీఎస్ఆర్టీసీ సేవలకు ఉమ్మడి మొబైల్ అప్లికేషన్ అభివృద్ధి చేయడానికి టీజీఎస్ఆర్టీసీతో చర్చలు జరపాలని అధికారులను ఆదేశించారు. మెట్రో ప్రయాణికుల కోసం రోజువారీ, వారాంత, నెలవారీ పాస్‌లు ప్రవేశపెట్టే అవకాశాలను కూడా పరిశీలించాలని సూచించారు. సమావేశంలో మెట్రో ఫేజ్-1 ప్రభుత్వ స్వాధీనం ప్రక్రియ, ఫేజ్-2కు సంబంధించిన భూసేకరణ, యుటిలిటీ షిఫ్టింగ్ పనుల పురోగతిపై చర్చించారు. అలాగే మెట్రో ఫేజ్-2కు అవసరమైన అనుమతుల స్థితిగతులను సమీక్షించారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అదనపు మెట్రో కోచ్‌ల కొనుగోలు ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రధాన కార్యదర్శి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మెట్రోపాలిటన్ ఏరియా ఓ పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, రోడ్లు--భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, డీజీపీ (లా అండ్ ఆర్డర్) మహేష్ ఎం. భగవత్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి శిక్తా పట్నాయక్, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ వర్క్స్ అండ్ సీవరేజ్ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ కె. అశోక్ రెడ్డి, హెచ్ఎంఆర్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి. అజిత్ రెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శివేంద్ర ప్రతాప్ తదితర బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ లబ్ధిదారులకు అద్భుత అవకాశం

హైద్రాబాద్: తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఇందిరమ్మ టవర్స్ పథకం కింద తొలి విడత గృహ నిర్మాణ పనులను ఆగస్టు చివరి వారంలో అధికారికంగా ప్రారంభించనున్నట్లు రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ నగరంలోని నిరుపేద కుటుంబాలు కూడా గౌరవప్రదమైన జీవితం గడపాలన్నదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని.. అందుకే ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. హైదరాబాద్ క్యూర్‌ప్రాంతం పరిధిలో మొత్తం ఒక లక్ష జీంప్లస్ ఇళ్లను దశలవారీగా నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఇందులో భాగంగా.. పైలట్ ప్రాజెక్ట్ మొదటి విడత కింద 16 అసెంబ్లీ నియోజకవర్గాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి 500 చొప్పున మొత్తం 8,000 ఇళ్ల నిర్మాణ పనులను వెంటనే చేపట్టనున్నారు. ఇప్పటికే ఈ 16 నియోజకవర్గాలతో పాటు మరో నాలుగు నియోజకవర్గాల్లో కూడా ప్రాజెక్టుకు కావలసిన ప్రభుత్వ స్థలాల సేకరణ, గుర్తింపు ప్రక్రియ పూర్తయిందని మంత్రి స్పష్టం చేశారు. ఫలక్‌నుమా ప్యాలెస్ సమీపంలో కూడా ఈ మోడల్ ఇందిరమ్మ టవర్ల నిర్మాణం చేపట్టడం విశేషమన్నారు. నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో నిర్మించే ఒక్కో ఫ్లాట్ మార్కెట్ విలువ భూమి విలువతో కలిపి రూ. 40 లక్షల నుంచి రూ. 60 లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. పైగా, ఎంపికైన ప్రతి లబ్ధిదారుడికి 20 నుంచి 22 గజాల అన్‌డివైడెడ్ షేర్ స్థలాన్ని ఉచితంగా వారి పేరు మీదనే రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ రూపకల్పన, నాణ్యతా ప్రమాణాలు ప్రైవేట్ గేటెడ్ కమ్యూనిటీలకు ఏమాత్రం తీసిపోకుండా ఉంటాయని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు. అర్హులైన నిరుపేదలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, అభ్యర్థులు తమ స్వంత నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని అక్కడ మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆగస్టు 10వ తేదీ లోపు తప్పనిసరిగా ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలని, దరఖాస్తుల స్వీకరణ గడువును పొడిగించే ఆలోచన లేదని మంత్రి స్పష్టం చేశారు. దరఖాస్తు సమయంలో చెల్లించాల్సిన రూ. 10 వేల డిపాజిట్ విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలు, పుకార్లను నమ్మవద్దని కోరారు. పరిశీలనలో అర్హత సాధించని వారికి వారు చెల్లించిన డిపాజిట్ మొత్తాన్ని 100 శాతం డిజిటల్ విధానంలో తిరిగి చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఖ్యూ× లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించిన నగదు నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోనే రీఫండ్ అవుతుంది. ప్రజల సొమ్ముకు సంపూర్ణ భద్రత ఉంటుందని, ప్రభుత్వం ప్రజా ప్రయోజనాల విషయంలో అత్యంత పారదర్శకత, బాధ్యతతో పనిచేస్తుందని పొంగులేటి శ్రీనివాసరెడ్డి పునరుద్ఘాటించారు. కాగా, ఒక్కో ఫ్లాట్ నిర్మాణానికి (భూమి విలువ కాకుండా) రూ.11 లక్షలు ఖర్చవుతుందని సర్కార్ అంచనా వేస్తోంది. ఇందులో రూ.5 లక్షలు ప్రభుత్వం ఇస్తుండగా.. రూ.6 లక్షలు లబ్ధిదారులు భరించాల్సి ఉంటుంది. అంటే అర్హత పొందిన లబ్ధిదారులు రూ. 6 లక్షలు చెల్లిస్తే భూమి విలువతో కలిపి రూ. 40 నుంచి రూ.60 లక్షల విలువైన ఫ్లాట్ సొంతం చేసుకోవచ్చు.

## రూ.1.80 కోట్లతో తండాలకు మహర్దశ



లక్ష్మీదేవిపల్లి : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ళ పెద్దతండా గ్రామపంచాయతీ పరిధిలోని రేగళ్ళ పెద్ద తండా నుండి మునియా తండా వెళ్లే ప్రధాన రహదారిపై రూ.1.80 కోట్ల వ్యయంతో నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమం రేగళ్ళ పెద్ద తండా సర్పంచ్ లావుడ్య పూర్ణ అధ్యక్షతన ఘనంగా నిర్వహించబడింది. సర్పంచ్ లావుడ్య పూర్ణ మాట్లాడుతూ, కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, రాష్ట్ర మంత్రివర్యులు శ్రీనివాస్ రెడ్డి తో కలిసి నిరంతరం కృషి చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. అనంతరం గ్రామ సమగ్ర అభివృద్ధికి సంబంధించిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యే కి అందజేశారు. వినతిపత్రంలో ఉమ్మడి గ్రామపంచాయతీ పరిధిలోని గిరిజన రైతులకు పట్టా హక్కులు కల్పించడం, కేటీపీఎస్ ఎన్ఎండీసీ నవభారత్ పరిశ్రమల సమీపంలో గ్రామం ఉన్నందున సీఎస్ఆర్ నిధుల ద్వారా అభివృద్ధి పనులు చేపట్టడం, అంగన్‌వాడీ కేంద్రానికి ప్రహరీ గోడ నిర్మాణం, గ్రామంలో డ్రైనేజీల నిర్మాణం, గట్టుమల్ల ఆర్ అండ్ బి రోడ్ నుండి మునియా తండా వరకు బీటీ రోడ్డు, ఆశ్రమ హాస్టల్ నుండి శేఖరం బంజారా రైల్వే స్టేషన్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం వంటి అభివృద్ధి పనులను చేపట్టాలని కోరారు. రేగళ్ల చెరువు నుండి కరకవాగు వరకు వేస్తున్నటువంటి బీటి రోడ్డు షోల్డర్ ఇరువైపులా చెరువు మట్టి వాడుతున్నారని నాణ్యత పరిణామాలోపం ప్లాస్టిక్ ఇండెక్స్ 6 శాతం కంటే తక్కువ ఉండదని భవిష్యత్తులో రోడ్డు కుంగిపోయే అవకాశం ఉందని ఇట్టి విషయాన్ని సంబంధిత అధికారులతో విచారణ జరిపి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ని కోరడం జరిగింది. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గ్రామ అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించి, అన్ని పనులు పూర్తయ్యే వరకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దూదియా తండా సర్పంచ్ బానోత్ రమేష్ బావోజి తండా సర్పంచ్ హాతిరాం , ట్రైబల్ డీఈ శ్రీకాంత్ , ఎమ్మార్వో , ఎంపీడీవో ఎస్ఐ ఉపసర్పంచ్ సునీత గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు , ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గుప్తనిధుల పేరుతో స్నేహితుడికి టోకరా!

నిజామాబాద్ : స్నేహాన్ని ఆసరాగా చేసుకుని, అప్పుగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకుండా తప్పించుకోవడానికి ఒక వ్యక్తి ఆడిన గుప్తనిధుల నాటకం నిజామాబాద్ జిల్లాలో కలకలం రేపింది. నిజామాబాద్ టౌన్‌లోని హమాల్‌వాడీకి చెందిన రమేష్, శ్రీనివాస్ ఇద్దరూ ప్రాణస్నేహితులు. ఈ క్రమంలో రమేష్ వద్ద శ్రీనివాస్ రూ. 1.30 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. కొంతకాలం తర్వాత రమేష్ తన డబ్బులను తిరిగి ఇవ్వాల్సిందిగా శ్రీనివాస్‌ను గట్టిగా నిలదీశాడు. దీంతో డబ్బులు ఎగ్గొట్టేందుకు పక్కా ప్లాన్ వేసిన శ్రీనివాస్... తనకు గుప్తనిధులు దొరికాయని, అందులో లభించిన బంగారమే ఇదని నమ్మబలుకుతూ కొన్ని రాళ్లను రమేష్‌కు అందించాడు. స్నేహితుడు ఇచ్చిన రాళ్లను చూసి అనుమానం వచ్చిన రమేష్, వెంటనే వాటిని నిపుణుల చేత పరీక్షించాడు. ఆ పరిశీలనలో అవి అసలైన బంగారం కాదని, సాధారణ కంకర రాళ్లకు మెరిసే బంగారం పూత పూసి తనను మోసం చేశాడని తేలడంతో రమేష్ షాక్‌కు గురయ్యాడు. తాను నమ్మిన స్నేహితుడే ఇలా మోసం చేయడంతో విసిగిపోయిన బాధితుడు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. రమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడైన శ్రీనివాస్‌పై చట్టపరమైన చర్యలు ప్రారంభించారు.

## టీబీ నిర్మూలనకు ముందస్తు పరీక్షలే కీలకం

నాగల్గిద్ద : టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా నాగల్గిద్ద మండలం కరాస్ గుత్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత ఛాతీ ఎక్స్రే శిబిరం నిర్వహించినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ జువేరియా బేగం తెలిపారు. శిబిరంలో మొత్తం 86 మందికి ఛాతీ ఎక్స్రే పరీక్షలు నిర్వహించినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రెండు వారాలకు పైగా దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, రాత్రివేళ చెమటలు పట్టడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టీబీని ముందస్తుగా గుర్తించి సకాలంలో పూర్తి చికిత్స పొందితే పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో టీబీ నిర్ధారణ పరీక్షలు, చికిత్స, మందులు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరంలో సూపర్వైజర్ విక్టోరియా రాణి, వైద్యులు పూజ పాటిల్, రాజశేఖర్ రెడ్డి, నర్సింగ్ ఆఫీసర్లు సబిత, హెల్త్ అసిస్టెంట్ మాధవ్రావు, ఫార్మసిస్ట్ గిరి, ఎస్టీఎస్ (నారాయణఖేడ్) ప్రకాశ్, ఏఎన్ఎంలు శాంతి, లక్ష్మీ తదితర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# పారదర్శక విచారణ చేయండి

హైదరాబాద్, : పోలీసు కస్టడీలో అక్రమ నిర్బంధం, చిత్రహింసల ఆరోపణలను అత్యంత పారదర్శకంగా విచారించాలని నగర పోలీసు కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఓ వ్యక్తిని చట్టవిరుద్ధంగా అదుపులో ఉంచి హింసించారన్న ఆరోపణలపై ఆధారాలను పరిశీలించి బాధితుడు సమర్పించిన ఫిర్యాదుపై తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించింది. పి. శ్రీకాంత్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ టి. మాధవీదేవి విచారించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది కదిరే అజిత్ రెడ్డి వాదనలు వినిపిస్తూ, జూలై 17న పోలీసులు శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకుని 24 గంటలకు మించి అక్రమంగా నిర్బంధంలో ఉంచారని, అనంతరం మాత్రమే రిమాండ్‌కు తరలించారన్నారు. నేరాన్ని అంగీకరించాలని ఒత్తిడి చేయడంతో పాటు, హైకోర్టులో వేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని వేధించారన్నారు. మలక్‌పేట స్టేషన్ పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని, బాధితుడికి పరిహారం కూడా అందించాలని కోరుతూ జూలై 21న డీజీపీ, నగర పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వివరించారు. వాదనలను పరిశీలించిన హైకోర్టు, నిర్బంధ సమయంలోని సీసీటీవీ ఫుటేజీ, వైద్య ఆధారాలను తప్పనిసరిగా పరిశీలించి నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితుడి వినతిపై చట్టప్రకారం నిర్ణయం తీసుకోవాలని పోలీసు కమిషనర్‌ను ఆదేశించింది. ఈ మేరకు పిటిషన్‌పై విచారణను ముగించింది.

## జీపీడీపీ పటిష్ట ప్రణాళికలను రూపొందించాలి

హనుమకొండ, : 2026-27 ఆర్థిక సంవత్సరానికి గ్రామ, మండల, జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు సమగ్రంగా పటిష్ట ప్రణాళికలను రూపొందించి నిర్ణీత గడువులోగా సమర్పించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ ప్రణాళికల రూపకల్పనపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సర్వ శిక్షా అభియాన్, వ్యవసాయ, సంక్షేమ, వైద్యారోగ్య, విద్యుత్, గ్రామీణాభివృద్ధి (డీఆర్డీఓ), మత్స్య, అటవీ, పౌర సరఫరాలు, పశు సంవర్ధక, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్, విద్య, రెవెన్యూ తదితర శాఖలు తమ 202627 కార్యాచరణ ప్రణాళికలు, అమలులో ఉన్న పథకాలు, ప్రతిపాదిత పనులు, అందుబాటులో ఉన్న వనరులు, లబ్ధిదారుల వివరాలు, నిధుల వినియోగం తదితర సమాచారాన్ని సమగ్రంగా సిద్ధం చేసి జీపీడీపీ ప్రణాళికల్లో పొందుపరచాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. అన్ని శాఖల జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులు గ్రామసభలు, మండల స్థాయి సమావేశాల్లో తప్పనిసరిగా పాల్గొని ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని, శాఖల మధ్య సమన్వయంతో గ్రామాభివృద్ధికి ఉపయోగపడే కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, ఇన్ఛార్జ్ అదనపు కలెక్టర్ శేషాద్రి, డీఆర్వో శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నాగర్‌కర్నూల్‌లో న్యాయవాది దారుణ హత్య

నాగర్‌కర్నూల్ : నాగర్‌కర్నూల్ జిల్లాలో ఓ న్యాయవాది అత్యంత దారుణంగా హత్యకు గురయ్యారు. పెంట్లవెల్లికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు, న్యాయవాది మల్లయ్య (55)పై దుండగులు పథకం ప్రకారం దాడి చేసి వేటకొడవళ్లతో నరికి చంపారు. ఈ ఘటన జిల్లాలో తీవ్ర సంచలనం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లయ్య పెంట్లవెల్లిలో క్లినిక్ నిర్వహిస్తూ ఆర్ఎంపీ వైద్యుడిగా, న్యాయవాదిగా జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం రాత్రి ఆయన క్లినిక్‌లో ఉండగా ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు ఆరోగ్య సమస్య ఉందని చెప్పి అక్కడికి వచ్చారు. వారిని పరిశీలిస్తున్న సమయంలో ఒక్కసారిగా మల్లయ్య కళ్లలో కారం చల్లి దాడికి పాల్పడ్డారు. అనంతరం ఆయనను క్లినిక్ నుంచి బయటకు ప్రధాన రహదారిపైకి లాక్కెళ్లి వేటకొడవళ్లతో విచక్షణారహితంగా నరికి హత్య చేశారు. తీవ్ర గాయాలతో మల్లయ్య అక్కడికక్కడే మృతిచెందారు. దాడి అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మల్లయ్య హత్య వెనుక భూ వివాదాలే ప్రధాన కారణమై ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## లక్ష డాలర్లు చెల్లిస్తే ఉద్యోగం చేసుకోవచ్చు..

న్యూయార్క్: అంతర్జాతీయ విద్యార్థుల నుంచి ట్రంప్ సర్కారు లక్ష డాలర్ల ఫీజు వసూల్ చేసే ప్రణాళిక వేసింది. అమెరికా వర్సిటీల్లో విద్యాభ్యాసం పూర్తి చేసిన తర్వాత అక్కడే పని చేయాలనుకుంటున్న స్టూడెంట్స్ నుంచి లక్ష డాలర్లు వసూల్ చేసే ఆలోచనలో ట్రంప్ సర్కారు ఉన్నట్లు తెలుస్తోంది. వాల్ స్ట్రీట్ జర్నల్ దీనిపై కథనాన్ని రాసింది. హెచ్1-బీ వీసాదారుల నుంచి లక్ష డాలర్ల ఫీజు వసూల్ చేయాలన్న ప్రతిపాదనను అమెరికా కోర్టు కొట్టివేయడంతో.. ట్రంప్ సర్కారు కొత్త మార్గాన్ని అన్వేషిస్తున్నది. విద్యార్థులకు ఇచ్చే ఎఫ్-1 వీసాలకు ఎక్స్‌టెన్షన్‌గా భావించే ఆప్షికల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ వీసాలపై అధిక ఫీజును వసూల్ చేయాలని ఆ దేశ హోంశాఖ భావిస్తున్నట్లు ద వాల్ స్ట్రీట్ జర్నల్ తన కథనంలో వెల్లడించింది. ఓపీటీ ప్రోగ్రామ్ ప్రకారం విదేశీ విద్యార్థులు తాము విద్యను పూర్తి చేసుకున్న ప్రాంతంలో సుమారు మూడేళ్ల వరకు పనిచేసే అవకాశం ఉంటుంది. 2024 నాటి రికార్డుల ప్రకారం సుమారు 4 లక్షల 19వేల విదేశీ విద్యార్థులు ఓపీటీ స్కీమ్ కింద అమెరికాలో పనిచేస్తున్నట్లు తెలిసింది. హెచ్1-బీ వీసాదారులపై లక్ష డాలర్ల ఫీజును వసూల్ చేయడాన్ని అమెరికాలోని టెకీ కంపెనీలు వ్యతిరేకించాయి. అమెరికా వర్సిటీల్లో చదివే విద్యార్థులకు ఆ కంపెనీలే ఎక్కువ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంటాయి.

## బంగారం తాకట్టు పెట్టే విషయంలో అప్రమత్తంగా ఉండాలి



కారేపల్లి : నకిలీ బంగారాన్ని తాకట్టు పెట్టి వివిధ బ్యాంకులు, ఆర్థిక సంస్థలను మోసం చేసిన ముందాడ రామచందర్ను పోలీసులు అరెస్ట్ చేశారు. నకిలీ బంగారు ఆభరణాలను అసలైనవిగా నమ్మించి రుణాలు పొందినట్లు విచారణలో వెల్లడైంది. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సింగరేణి సర్కిల్ సీఐ నునావత్ సాగర్ మాట్లాడుతూ, జూన్ 10వ తేదీన ఇల్లందు బ్రాంచ్ కు చెందిన ముత్తూట్ ఫైనాన్స్ లో తమ గోల్ ను విడిపించాలని మన గోల్ సంస్థకు సంప్రదించి బ్యాంక్ కు వెళ్లే క్రమంలో గూగులోత్ సునీల్ ధరావత్ రాకేష్ అనే వ్యక్తులు బస్వాపురం గ్రామ సమీపంలో మన గోల్ సంస్థకు చెందిన వ్యక్తి దగ్గర ఉన్న 5 లక్షల 80 వేల రూపాయలను కాజేసీ అక్కడి నుండి పరారయ్యారు. మన గోల్ సంస్థ వారి ఫిర్యాదుతో జూలై 10న కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదుతో విచారణ చేపట్టగా జూలై 29న సునీల్ అనే నిందితుడిని అరెస్ట్ చేసి విచారించగా అట్టి సొమ్మును కారేపల్లికి చెందిన వ్యాపారి రామచందర్ కు ఇచ్చినట్టు తెలిపారు, నిందితుడి సమాచారంతో ముందాడా రామచందర్ అరెస్ట్ చేసి విచారించగా తన వాంగ్మూలం ఆధారంగా కేసుకు సంబంధించిన కీలక వివరాలు వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఈ మోసంలో మరికొందరి ప్రమేయంపై కూడా విచారణ కొనసాగుతోందని గిల్ట్ బంగారం పేరుతో అమాయక ప్రజలు, ఆర్థిక సంస్థలను మోసం చేసే ముఠాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలనీ కోరారు. కారేపల్లి, ఇల్లెందు, భద్రాచలం, కొత్తగూడెం తదితర ప్రాంతాల్లో 30 మంది ఏజెంట్ లతో ఘరానా మోసాలకు పాల్పడినట్లు సమాచారం ఉందనీ అలాగే అదుపులో ఉన్న నిందితుడు రామచందర్ ను కోర్టు లో హాజరు పరిచి తన వద్ద దొరికిన 15వేల రూపాయలు సెల్ఫోన్ అలాగే వెర్నా కారును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితులు సునీల్ ను జూలై 29న రిమాండ్ కు తరలించగా,మరో నిందితుడు రాకేష్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. బంగారం తాకట్టు పెట్టే ముందు సంబంధిత వ్యక్తులు, వస్తువుల నిజానిజాలను తప్పనిసరిగా నిర్ధారించుకోవాలి. ఇలాంటి మోసాలకు గురైన వారు ఎవరైనా ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలనీ తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, మోసగాళ్లపై కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు. ఈ దర్యాప్తులో కారేపల్లి ఎస్ఐ బైరు గోపి, ఎస్ఐ శ్రీకాంత్ తో పాటు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.),
Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528